# కంకోల్‌లో సిఎం సందడి

## ఫుట్‌బాల్ ప్రాక్టీసు చేసిన రేవంత్‌రెడ్డి

**సంగారెడ్డి, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్‌కు వచ్చారు. కంకోల్‌లోని వోక్సన్ యూనివర్సిటిలో విధ్యార్థులతో ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేశారు. ఈ నెల 13న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో వరల్డ్ ఫుట్‌బాల్ ఛాంపియన్ మెస్సీతో సిఎం రేవంత్ రెడ్డికి మ్యాచ్ వుండటంతో ఇక్కడ రెండు గంటల పాటు మ్యాచ్ ప్రాక్టీస్ చేశారు. కాగా, సిఎం రాక సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి వోక్సన్ యూనివర్సిటీకి వస్తున్నందున స్థానిక నాయకులతోపాటు ఎవరనీ వోక్సన్ యూనివర్సిటీలోకి అధికారులు అనుమతించలేదు.

## సామాజిక న్యాయం కోసం పోరాడిన వ్యక్తి బొమ్మ వెంకన్న

**-రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



బొమ్మ వెంకన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 12, ప్రభాతవార్త:**
సామాజిక న్యాయం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి ఇందుర్తి మాజీ శాసనసభ్యులు బొమ్మ వెంకన్న అని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం రోజున బొమ్మ వెంకన్న జయంతి సందర్భంగా హుస్నాబాద్‌లోని నాగారం చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తాను విద్యార్థి దశలో ఉన్నప్పుడు బలహీన వర్గాల ఉద్యమం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం ఎప్పటికీ మరిచిపోమన్నారు. హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధి కొరకు ఆయన కృషి వెలకట్టలేనిదన్నారు. మాజీ శాసన సభ్యులుగా ఉండి ఈ ప్రాంతంలో రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష అయిన గౌరవెల్లి ప్రాజెక్ట్ సాధన కోసం పని చేశారని, అనేక సందర్భాల్లో తనకు మార్గదర్శిగా ఉన్న బొమ్మ వెంకన్న ఉంటారని, ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో బొమ్మ వెంకన్న కుమారుడు, మాజీ హౌజ్‌ఫెడ్ చైర్మెన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జిల్లా గ్రంధాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మెన్ కంది తిరుపతిరెడ్డి, వైస్ చైర్మెన్ బంక చందు, సీనియర్ నాయకులు చిత్తారి రవిందర్, పద్మ, వెన్న రాజు, డాక్టర్ అక్కు శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

**ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్‌లను సత్కరించిన మంత్రి...**
హుస్నాబాద్ మండలం వంగరామయ్యపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన భూక్య రాజేశ్వరి తిరుపతి, ఉప సర్పంచ్ దుండుగుల రాజు, వార్డు మెంబర్లను పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వంగరామయ్య పల్లి గ్రామాన్ని ఏకగ్రీవ సర్పంచ్‌గా అభివృద్ధికి ఐక్యంగా పని చేయాలని సూచించారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

## ఏకగ్రీవ సర్పంచ్‌ను సన్మానించిన మంత్రి



సర్పంచ్‌గా ఎన్నికైన రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

**చౌటకూరు, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని సరాఫ్‌పల్లి గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన నందికంటి రామచంద్రారెడ్డిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహ శాలువాతో సత్కరించి అభినందించారు. సరాఫ్‌పల్లి సర్పంచ్‌గా ఎన్నికైన రామచంద్రారెడ్డి గురువారం రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహను జిల్లా కేంద్రమైన సంగారరెడ్డిలోని నివాసంలో మర్యాద పూర్వకంగా కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నిక కావడం అభినందనీయని, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని రామచంద్రారెడ్డికి సూచించారు. సరాఫ్‌పల్లి గ్రామాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని హామి చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, సరాఫ్‌పల్లి కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు శివరాజ్‌గౌడ్, నాయకుఉలు పార్కల ప్రభాకర్‌రెడ్డి,కార్తీక్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## మల్లికార్జునస్వామి కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాష్ట్ర ఎండోమెంట్ జాయింట్ కమిషనర్ ఎం.రామకృష్ణరావు

**కొమురవెల్లి, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామి వార్షిక కళ్యాణోత్సవం సందర్భంగా చేస్తున్న ఏర్పాట్లను ఫెస్టివల్ ఆఫీసర్ రాష్ట్ర ఎండోమెంట్ జాయింట్ కమిషనర్ ఎం.రామకృష్ణరావు గురువారం పరిశీలించారు. కళ్యాణవేదిక, క్యూ కాంప్లెక్స్, దేవాలయ పరిసరాలు తిరిగి చూశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ మహోత్సవానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని సూచించారు. శానిటేషన్‌పై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎసి సుధాకర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఓం ప్రకాష్, ఆలయ ఈవో వెంకటేష్, ఎఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు నీల చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

## గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం

**నర్సాపూర్, డిసెంబరు 10, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండల పరిధిలోని 35 గ్రామపంచాయతీలకు జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో 103మంది అభ్యర్థులు సర్పంచ్ ఎన్నికలబరిలో పోటీపడుతున్నారు. 35గ్రామపంచాయతీలకు గాను రెండు ఎర్రగుంటతండ గ్రామపంచాయతీకి, రూప్‌సింగ్‌తండా గ్రామపంచాయతీకి సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో ఎర్రగుంటతండా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా సురేష్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా, రూప్సింగ్‌తండా గ్రామపంచాయతీకి గేమ్యానాయక్ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే మండలంలో మిగతా 33గ్రామపంచాయతీలకు మూడో విడత ఎన్నికలు ఈనెల 17న జరగనున్నాయి. ఈగ్రామపంచాయతీల సర్పంచ్ ఎన్నికల్లో అన్ని చోట్ల ద్విముఖ, త్రిముఖ, చతుర్ముఖ, పోటీలు ఉండగా మండలపరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీకి 8మంది అభ్యర్థులు సర్పంచ్‌గా పోటీలో ఉన్నారు. అదేవిధంగా చిన్న చింతకుంట గ్రామపంచాయతీలో, ఇబ్రహీంబాద్ గ్రామపంచాయతీలలో 6మంది అభ్యర్థులు సర్పంచ్ పోటీలో నిలుచున్నారు. ఈగ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో వారికి కేటాయించిన కత్తెర, బ్యాట్, బాల్, ఉంగరం వంటి గుర్తులతో ప్రచారంలోకి దూసుకుపోతున్నారు. అంతేగాక ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపిలకు సంబంధించిన అభ్యర్థుల తరపున నాయకులు కార్యకర్తలు ప్రచారంచేయడం ప్రారంభించారు. సర్పంచ్‌ల ఎన్నికల్లో కేవలం తక్కువరోజులు మాత్రమే ప్రచారం ఉంటుందన్న భావనతో ఆయా గ్రామపంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులు తమ ప్రచారాలను వేగవంతం చేస్తున్నారు. ఈ ప్రచారాల అనంతరం ఈనెల 17న జరిగే పోలింగ్ అనంతరం ఏ గ్రామానికి ఎవరెవరు సర్పంచ్ అవుతారో వేచి చూడాల్సిందే మరి.



# మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట వార్త

## వివాదాస్పద వ్యక్తుల బైండోవర్..

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
సిద్దిపేట డివిజన్‌పరిధిలో ఎలక్షన్‌లదృష్ట్యా రౌడీషీటర్లను, బెల్ట్‌షాప్‌నడుపుతున్న, వివాదాస్పద వ్యక్తులను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా సంబంధిత తహసీల్దార్ల ఎదుట బైండోవర్‌చేసినట్లు సిద్దిపేట ఎసిపి రవీందర్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేసిన ప్పటికీ, తిరిగి బాండ్‌ను ధిక్కరించి క్రిమినల్/ఎంసిసికేసులలో ఇన్వాల్వ్ అయినట్లు ఆయన తెలిపారు. బాండ్‌ను ధిక్కరించినవారిలో సిద్దిపేటరూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లికి చెందిన బట్టు భాస్కర్, తౌటి తిరుపతి, గుర్రం శ్రావణ్, పెచ్చన్నగారి ధశేందర్, నంగునూర్‌మండలం అప్పలాయిచెరువుకు చెందిన నాయిని రాజశేఖర్, మిరుదొడ్డిమండలం మల్లుపల్లికిచెందిన గరిపల్లి లక్ష్మణ్, భూంపల్లి-అక్బర్‌పేట మండలం తాళ్లపల్లికిచెందిన గోపారి దయాకర్, గోపారి యాదగిరిలు ఉన్నట్లు, వీరిపై తగుచర్యలు తీసుకోవాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలు తహసీల్దార్లకు రిక్విజిషన్ పంపినట్లు తెలిపారు.

# పోలింగ్ కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ తనిఖీలు

**-నేటి సాయంత్రం 5గంటల నుంచి ప్రచారం నిర్వహించొద్దు**
**-ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు మద్యం దుకాణాలు మూసివేయాలి**
**-జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కె.హైమావతి**



శ్రీగిరిపల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**గజ్వేల్, డిసెంబరు 11 (ప్రభాతవార్త):**
సిద్దిపేట జిల్లాలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లోభాగంగా గజ్వేల్, ములుగు, మర్కుక్, జగదేవ్‌పూర్, వర్గల్, రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో గ్రామపంచాయతీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ఉదయం 8గంటలకే మొదలైందని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కె.హైమావతి పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించారు. అలాగే మైక్రో అబ్జర్వర్లను నియమించడం జరిగిందని పేర్కొన్నారు. దాదాపు 3వేలకు పైగా సిబ్బంది గ్రామపంచాయతీ ఎన్నికల విధులు నిర్వహించినట్లు తెలిపారు. మధ్యాహ్నం 1గంట వరకు క్యూ లైన్‌లో ఉన్న ఓటర్లకు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అనుమతించినట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత కౌంటింగ్ ప్రారంభించగా రాత్రి 7 గంటల వరకు కొనసాగిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

**సిద్దిపేట డివిజన్‌లో ఈనెల 14న పోలింగ్...**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో రెండోవిడత ఎన్నికల పోలింగ్ ఈనెల 14న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ కె.హైమావతి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు 2వవిడత సిద్దిపేట డివిజన్‌లోని అక్బర్‌పేట-భూంపల్లి, చిన్నకోడూరు, దుబ్బాక, మిరుదొడ్డి, నంగునూర్, నారాయణరావుపేట, సిద్దిపేట రూరల్, సిద్దిపేట అర్బన్, తొగుట మండలాలతో పాటు హుస్నాబాద్ డివిజన్‌లోని బెజ్జంకి మండలంలో ఆయా గ్రామాలలో ఈనెల 12 సాయంత్రం 5గంటల వరకు మాత్రమే ఎన్నికల ప్రచారానికి అనుమతి ఉందని తెలిపారు. ఆయా మండలాల పరిధిలోని గ్రామాలలో ఈనెల 12 సాయంత్రం 5గంటల తర్వాత ఎలాంటి ఎన్నికల ప్రచారం నిర్వహించినా, ఎన్నికల నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలాగే ఎన్నికల నిబంధనల మేరకు రెండోవిడత ఎన్నికలు జరిగే మండలాల గ్రామాల పరిధిలోగల మద్యం దుకాణాలను సాయంత్రం 5 గంటల నుంచి ఈనెల 14న ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేవరకు మూసి వేసివేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి ఆదేశించారు.

# జిల్లాలో మొదటి ఫేజ్ పోలింగ్ శాతం 88.46

**-మొత్తం 1,63, 148 ఓట్లలో**
**పోలైన ఓట్లు 1,44,323**
**-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**



పోలింగ్‌కేంద్రంలో ఓటింగ్‌ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

**మెదక్ టౌన్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికల పోలింగ్ 88.46 శాతం నమోదు అయింది. పాపన్నపేట, టేక్మాల్, హవేలి ఘనపూర్, పెద్ద శంకరంపేట, రేగోడు, అల్లాదుర్గ్ రూరల్ మండలాల్లో గురువారం పోలింగ్ నిర్వహించారు.
మొదటి విడత గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. 6మండలాల్లో కలిపి మొత్తం 1,63,148 ఓట్లు ఉండగా, 1,44,323 పోల్ అయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత పోలింగ్ ముగిసే సమయానికి 88.46 శాతం పోలింగ్ నమోదు అయిందని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు.

### మండలాలవారీగా ఓటర్లు

**నమోదు అయిన పోలింగ్ శాతం..**
అల్లాదుర్గ్ రూరల్ మండలంలో మొత్తం ఓటర్లు 23,555మంది ఉండగా, 20,784 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 88.24 శాతం నమోదు అయింది. హవేలీ ఘనపూర్ మండలంలో మొత్తం ఓటర్లు 29,646మంది ఉండగా, 26,328మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 88.81 శాతం నమోదు అయింది. పాపన్నపేట మండలంలో మొత్తం ఓటర్లు 36,213మంది ఉండగా, 32,176మంది ఓటుహక్కు వినియో గించుకున్నారు. 88.85 శాతం నమోదు అయింది. రేగోడు రూరల్ మండలంలో మొత్తం ఓటర్లు 18,747మంది ఉండగా, 17,085మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 91.13 శాతం నమోదు అయింది. శంకరంపేట(ఎ) మండలంలో మొత్తం ఓటర్లు 28,254మంది ఉండగా, 24,543మంది ఓటు హక్కు వినియోగిం చుకున్నారు. 86.87 శాతం నమోదు అయింది. టేక్మాల్ మండలంలో మొత్తం ఓటర్లు 26,733మంది ఉండగా, 23,407 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 87.56 శాతం నమోదు అయినట్లు కలెక్టర్ తెలిపారు.

# మండలంలో ప్రశాంతంగా జరిగిన ఎన్నికలు

**-పోలింగ్ కేంద్రాలను తనిఖీచేసిన ఎస్పీ పరితోష్‌పంకజ్**



పరిస్థితిని తెలుసుకుంటున్న ఎస్పీ పరితోష్‌పంకజ్

**గుమ్మడిదల, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండల పరిధిలో గురువారం మొదటి విడత జరిగిన పంచాయతీ ఎన్నికలు పూర్తి ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఉదయం నుంచే ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియో గించారు. అన్ని కేంద్రాల్లో సరైన ఏర్పాట్లు చేయడం వల్ల ఎక్కడా పెద్దగా ఇబ్బందులు చోటుచేసుకోలేదు. ఎన్నికల నిర్వ హణను పరిశీలించేందుకు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్‌పంకజ్ స్వయంగా నల్లవల్లి, కానుకుంట గ్రామా లను సందర్శించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి భద్రతా చర్యలను, సిసి కెమెరా పర్యవేక్షణను, సిబ్బంది విధులను సమీక్షించారు. ప్రజలు భయభ్రాంతులకు గురి కాకుండా ఓటు వేయాలని ఎస్పీ సూచించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగ కుండా పోలీసులు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేశారని ఎస్పీ తెలిపారు. మొత్తం మండలంలో పోలింగ్ 89 శాతం స్థాయిలో నమోదయింది. వీరివెంట స్థానిక ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# లేబర్ కోడ్స్‌కి వ్యతిరేకంగా ఐక్య పోరాటం

**-సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు**



సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

**పటాన్‌చెరు, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
రాబోయేరోజుల్లో లేబర్‌కోడ్స్‌కి వ్యతిరేకంగా కార్మికవర్గమంతా ఐక్యపోరాటాలకు సిద్ధంకావాలని శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో శాండ్విక్ ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశా నికి రాష్ట్ర అధ్యక్షులు, శాండ్విక్ యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఇటీవల డిసెంబర్ 7నుండి 9వరకు మెదక్‌లో జరిగిన సిఐటియు రాష్ట్ర మహాసభలలో 5వసారి తిరిగి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన చుక్క రాములుకు కార్మికులు అభినందనలు తెలియజేశారు.
ఈసందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ, మూడు రోజులపాటు మహాసభలలో చర్చించిన అంశాలు, చేసిన తీర్మానాలను కార్మికులకు వివరించారు. ముఖ్యంగా రాబోయే కాలంలో నాన్‌పర్మినెంట్ ఉద్యోగులు విపరీతంగా పెరిగే అవకాశం ఉందని, స్టైఫండ్‌తో పనిచేసే కార్మికులతో యాజమాన్యాలు శ్రమదోపిడీకి పాల్పడుతున్నాయని చెప్పారు. కేంద్రప్రభుత్వం తక్షణమే ఈలేబర్‌కోడ్స్ ఉపసంహరించుకోవాలని, నూతన లేబర్ పాలసీని రద్దుచేయాలని, పై అంశాలపై భవిష్యత్తులో జరిగే ఐక్య పోరాటాలకు కార్మికవర్గం సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే డిసెంబర్ 31నుండి 4వతేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు 18వ అఖిలభారత జాతీయ మహాసభల సందర్భంగా డిసెంబర్ 15వ తేదీన అన్నిప్రాంతాలలో సిఐటియు జెండాలను ఎగురవేసి ఫ్లాగ్‌డే నిర్వహించాలని చుక్క రాములు పిలుపునిచ్చారు. అనంతరం సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికైన పి.పాండు రంగారెడ్డి, డి.తులసికి కార్మికులు అభినందనలు తెలియజేశారు. సమావేశంలో పి.పాండురంగారెడ్డి, ఎమ్.మనోహర్, ఎ.వీరారావు, వి.సదాశివ రెడ్డి, ఎమ్.సత్తిబాబు, కమిటీసభ్యులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వాహనం తనిఖీ



ఎమ్మెల్యే వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

**వెల్దుర్తి, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎన్నికల అధికారులు మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించడానికి మాసాయిపేట వెళుతుండగా బొమ్మారం వద్ద ఎన్నికల అధికారులు అప్పుడే వచ్చిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వాహనాన్ని అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

## అక్రమంగా మద్యం రవాణా

**-ఇద్దరిపై కేసు నమోదు**



మద్యం స్వాధీనం చేసుకున్న దృశ్యం

**కోహెడ, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
ఎన్నికల నియామవళిని ఉల్లంఘించి మద్యం రవాణాచేస్తున్న ఇద్దరు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని మైసంపల్లికి చెందిన వేముగంటి సాయి, అందె కిషోర్‌లు ద్విచక్ర వాహనంపై ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం రవాణాచేస్తున్నట్లు తెలియగానే వాహనాల తనిఖీలో భాగంగా కార్టన్ బాక్స్‌లో మద్యం దొరికినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడానికి మద్యం తీసుకెళ్తున్నట్లు అంగీకరించడంతో పంచాయతీరాజ్, ఎక్సైజ చట్టం ప్రకారం, ఎన్నికల నియామవళి ఉల్లంఘన చట్టాల కింద పలు సెక్షన్ల ప్రకారం, కేసు నమోదు చేసినట్లు వివరించారు. మండలపరిధిలోని ఆయాగ్రామాల్లో ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికలు సజావుగా జరగడానికి స్వేచ్ఛాపూరిత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

### గురుకుల పాఠశాలలో

## విద్యార్థుల కిడ్నాప్‌కు యత్నం

**-విద్యార్థులు కేకలు పెట్టడంతో పారిపోయిన కిడ్నాపర్లు**

**సంగారెడ్డి, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
విధ్యార్థులను గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్‌కు యత్నించిన సంఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల పాఠశాలలో గురువారం జరిగింది. వివరాలలోకి వెళ్తే.. మండలంలోని తెలంగాణ బిసి గురుకుల పాఠశాలలో ఆరవతరగతి చదువుతున్న సిద్ధార్థ, రాకేష్‌లను గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాల వెనుక వైపు నుంచి వచ్చి వారిపై పౌడర్‌చల్లి కిడ్నాప్‌చేసే ప్రయత్నంచేశారు. వారు భయపడి గట్టిగా అరవడంతో, అరుపులు విని చుట్టుపక్కలవారు రావడంచూసి కిడ్నాపర్లు పరారయ్యారు. చికిత్స నిమిత్తం విద్యార్థులను జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ప్రిన్సిపాల్ సురభి చైతన్య తెలిపారు. మెరుగైన చికిత్స నిమిత్తం జహీరాబాద్ నుంచి వైద్యులు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. కిడ్నాపర్లను గుర్తించడానికి పోలీసులు సిసిటివి ఫుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

## గతసారి 6పంచాయతీలు ఏకగ్రీవం-ఈసారి జీరో

**మనూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
గతపంచాయతీ ఎన్నికల్లో మండలంలో 6పంచాయతీలు బిఆర్ఎస్ మద్దతుదారులు (రానాపూర్, బాదల్‌గావ్, ఎల్గోయి, దోవూర్, ఎన్జిహుక్రానా, పలుకుర్తి) ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకోగా ఈమారు ఒక పంచాయతీ కూడా ఏకగ్రీవంగా ఎన్నికకాలేదు. అధికారపార్టీ ఈమారు ఏక్రగీవానికి ప్రయత్నించినా ప్రయోజనం పొందలేకపోయిందని చెప్పవచ్చు. కాంగ్రెస్‌పార్టీకి ఏకగ్రీవం దక్కక పోగా ఈమారు రెబెల్ బెడద అధికంగా ఉంది. మండల కేంద్రమైన మనూర్‌తో పాటు మండలపరిధిలోని అతిమ్యాల్‌లో బిఆర్ఎస్ మద్దతుదారులు పోటీకి దూరంగా ఉన్నా, కాంగ్రెస్ మద్దతుదారులు (గంపలి రమ్యసిద్దారెడ్డి, చీకూర్తి మీనాసతీష్) బరిలో ఉండటంతో ఎన్నికలు తప్పడంలేదు.



మాట్లాడుతున్న నాగమారుతి శర్మ

## జానపద గీతాల గేయకవి నందూరి వెంకట సుబ్బా రావు

### సిబిఐ కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ

**చిక్కడపల్లి, డిసెంబరు 11 (ప్రభాతవార్త):** జానపద గీతాల గేయకవిగా సుప్రసిద్ధులు నందూరి వెంకట సుబ్బారావు అని సిబిఐ కోర్ట్ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతిశర్మ అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికలో ఎందరో మహనుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా గేయ రచయిత నందూరి వెంకట సుబ్బారావు యాదిలో సభ గానసభ నిర్వహణ లో అధ్యక్షుడు కళావి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగమారుతి శర్మ మాట్లాడుతూ నందూరి వెంకట సుబ్బారావు ఎంకి పాటల ద్వారా పేరుపొంది,ఈ పాటలు ఆంధ్రదేశమంతా పేరును సంపాదించిపెట్టాయన్నారు. తన సొంతశైలిలో గోదావరి మాండలి కంలో ఎంకిపాటల ద్వారా ప్రసిద్ధిపొందిన సుబ్బారావు ఒక గేయసంపుటి రూపొందించారని, చిత్ర నళినీయం అనే పేరిట ఆరు నాటకాలను రాసా రని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి రఘుశ్రీ, సంఘసేవకులు పిఎస్ ఆర్ మూర్తి, గాయని పెరి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

### నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి



కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డిని సన్మానించిన దృశ్యం

**చిక్కడపల్లి డిసెంబర్ 11(ప్రభాతవార్త):** గ్రంథాలయాల సత్వతోముఖాభి వృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి పునరుద్ఘాటించారు. గురువారం నగర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి సంవత్సరం అయినందున హైదరా బాద్ నగర గ్రంథాల సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ ఆధ్వర్యంలో ఉద్యోగస్తులు, విశ్రాంత ఉద్యోగస్తులు, గ్రంథాలయ ఔట్సోర్సింగ్ ఉద్యో గస్తులు కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఉద్యోగస్తులు వెంకటేశ్వరరెడ్డి, అవినాష, వెంకటేష్‌యాదవ్, బొల్లం మహేందర్, రామ్మోహన్, పిడి మహేష్, గ్రేడ్ వన్ లైబ్రేరిన్ చంద్ర కళ, ప్రతిభారెడ్డి, శుక్లాదేవి, తారక రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ సమస్యల పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే



వివేక్‌నగర్ బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

**చిక్కడపల్లి, డిసెంబర్ 11(ప్రభాతవార్త):** ముషీరాబాద్ నియోజకవర్గం లోని గాంధీనగర్ డివిజన్ వివేక్‌నగర్ స్లం బస్తీ వాసుల సమస్యల పరిష్కా రానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని స్థానిక శాసనసభ్యుడు ముఠా గోపాల్ అన్నారు. గురువారం బిఆర్ యస్ సీనియర్ నాయకులు ముఠా నరేష్ నేతృత్వంలో స్థానిక బస్తి వాసులు ఎదుర్కొంటున్న మంచినీరు, డ్రైనేజ్ సమస్యపై ముఠాగోపాల్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే జలమండలి అధికారులు పిలిపించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మీడియా ఇన్చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, రవిశంకర్ గుప్తా, ముచ కుర్తి పద్మ, కుమారస్వామి, జలమండలి అధికారులు డీజీఎం కార్తీక్ రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, బస్తి వాసులు జాల సురేష్, సుబ్బారావు, యాదగిరి, శివ, సత్తెమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మౌలిక సదుపాయాలకు ప్రథమ ప్రాధాన్యం

### ఎమ్మెల్యే వివేకానంద



ఎమ్మెల్యే వివేకానందను సత్కరిస్తున్న స్థానిక ప్రజలు

**జీడిమెట్ల, డిసెంబరు 11 ప్రభాతవార్త :** ప్రజల మౌలిక సదుపాయాలే ప్రథమ ప్రాధాన్యం అని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద అన్నారు. గురువారం గాజులరామారం డివిజన్‌లోని వార్డు నంబర్ 125 పరిధిలో ఉన్న రోడ మేస్త్రీనగర్ బికాలనీలో నెలకొన్న సీసీరోడ్డు, డ్రైనేజ్ సమస్యలను పరిష్కరిం చేందుకు ఎమ్మెల్యే కె.పి.వివేకానంద సంబంధిత శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు రోడ్ల దుస్థితి, వర్షాకాలంలో నిల్వ ఉండే మురుగు నీరు, డ్రైనేజీ అడ్డంకుల వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. సమస్య లను నిశితంగా పరిశీలించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత ఇంజినీరింగ్ అధి కారులు, జిహెచ్‌ఎంసీ అధికారులు తగిన చర్యలు చేపట్టి సీసీ రోడ్డు నిర్మాణం, డ్రైనేజ్ మరమ్మ తులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడమేస్త్రీ నగర్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి నిరక్ష ...్యం ఉండదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికా రులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిష్టప్ప, స్థానికులు షేక్ ముజ్జు, షేక్ అమీర్, ఫర్జానా బేగం, షమీమ్ బేగం, షాహ నవాజ్, శాదూల్, మొహసిన్, పార్టీ నాయకులు కస్తూరి బాలరాజు, కమలాకర్, తెలం గాణ సాయి మక్సూద్ అలీ, ఇబ్రహీం, ఇమ్రాన్, నాగేష్, మహేష్, చెట్ల వెంకటేష్, మద్దెల సాయి బాబా, శివనాయక్, బాబి చౌదరి, హనుమంత్ నాయక్,లక్ష్మణ్, జునైద్‌కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత

## ఉద్యోగ ప్రకటన వచ్చే అవకాశం : పిడిమర్తి రవి

**సైఫాబాద్, డిసెంబరు 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉస్మానియా విశ్వవిద్యాయలంలో బుధవారం జరిగిన బహిరంగ సభలో సిఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ ప్రకటన చేయలేకపోయారని ఎస్సీ కార్పోరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పిడమర్తి రవి చెప్పారు. బహిరంగ సభలో సిఎం ఉద్యోగ ప్రకటన చేస్తారని యువత ఆశించిందని, కాని ఎన్నికల కోడ్ ఉన్నప్పుడు ప్రకటన చేయకూడదని, ఎన్నికల తరువాత కోడ్ ఎత్తివేసిన తరువాత సిఎం ఉద్యోగ ప్రకటన చేసే అవకాశం ఉందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కా ంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక ఉద్యోగ నోటిఫికేషన్‌లు ఇచ్చి, వేలాది ఉద్యోగాలను భర్తీ చేసిందని ఆయన గుర్తు చేశారు. ఎన్నో దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకొని ఉస్మానియా విశ్వవిద్యాలయం అభివృద్ధికి సిఎం 1000 కోట్లు కేటాయించడం గొప్ప విషయమని, ఓయూలో అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేందుకు సిఎం బడ్జెట్ కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# డివిజన్ల పునర్విభజనలో మార్పులు చెయ్యాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**జగద్గిరిగుట్ట, డిసెంబరు 11, ప్రభాతవార్త**

పునర్విభజన సందర్భంగా జరిగిన లోటుపాట్ల ను సరిదిద్ది ఒకే బస్తీలో ఉన్నటువంటి అన్ని గల్లీ లను ఒకే డివిజన్లో కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని గురువారం గాజులరామారావు డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిహెచ్ ఎంసీ డివిజన్ విభజన గంధరగోళంగా ఉందని ఒకే బస్తిలోని కొన్ని గల్లీలు ఒక డివిజన్‌కి మరి కొన్ని గల్లీలు ఇతర డివిజన్లకు కేటాయించారని, ఒకే ఇంటి నెంబర్‌కు వచ్చే క్రమ సంఖ్యలు కూడా ఒక్కొక్క డివిజన్‌కి కేటాయించారని, చిరునామా లోని పిన్ కోడ్ ఒక్కటే ఉన్నప్పటికీ ఇతర పిన్ కోడ్‌లు ఉన్న డివిజన్లకు కేటాయించారని దీనివల్ల ప్రజలకు గందరగోళ పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఈ అంశంపైన జిహెచ్‌ఎంసి ప్రధాన కమిషనర్‌ని కూడా కలిసి అభిప్రాయాలను చెప్పి గతంలో జగద్గిరిగుట్టలో ఉన్నటువంటి మక్దుమ్ నగర్‌లోని అన్ని బస్తీలను కలిసి ఉండేలా చూసి డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతామన్నారు. అదేవిధంగా గాజులరామారం డివిజన్‌కి దూరంగా ఉన్నటువంటి మిథిలా నగర్‌ను తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్య దర్శి ఉమామహేష్, మండల కార్యదర్శి స్వామి సహాయ కార్యదర్శి హరినాథ్ రావు, జగద్గిరిగుట్ట శాఖ కార్యదర్శి ఎం.సహదేవరెడ్డి, నాయకులు సుంకిరెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



బీఎస్ వెంకట్రావ్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

## బిఎస్ వెంకట్రావ్‌కు ఘన నివాళి

**సికింద్రాబాద్, డిసెంబర్ 11 ప్రభాతవార్త :** బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిన సంఘ సేవకుడు, హైద్రాబాద్ అంబేద్కర్‌గా ఖ్యాతి గాంచిన మహనీయుడు, నిజాం ప్రభుత్వంలో చివరి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన స్వర్గీయ బీఎస్ వెంకట్రావు అని సాయిబాబా ఆలయం మాజీ అధ్యక్షుడు మంచాల గోపి అన్నారు. హైద్రాబాద్ అంబేద్కర్ స్వర్గీయ బీఎస్. వెంకట్రావు 126వ జయంతి సందర్భంగా గురువారం బోయిగూడ లోని వెంకట్రావు, అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసిన నివాళులర్పించారు. అప్పట్లోనే ఆయన నిరుపేద దళిత విద్యార్థులకు నిజాం ప్రభుత్వం ద్వారా స్కాలర్ షిప్ లను ఇప్పించారని ఆయన అన్నారు. అందుకోసం తన స్వంత ఆస్తులను కూడా విక్రయించిన మహనీయుడని కొనియాడారు. బోయిగూడలోని కీస్ బ్లాక్స్ లో, అల్వాల్ లోని వెంకటా పురం ప్రాంతంలో ఎందరో పేదలకు ఆయన ఇంటి స్థలాలను ఇప్పించారని, ఇండ్లు కూడా నిర్మించి ఇచ్చారని చెప్పారు. అలాంటి గొప్ప దళిత నాయకుడి జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్ వెంకట్రావు కుమారుడు బీవీ. చంద్రమోహన్, స్థానిక నాయకులు గుంటి సత్యనారాయణ, ఓ.రాజు, కొండ శంకర్, అంజి రెడ్డి, రాజకుమార్, కుమార్ యాదవ్, సత్యదేవ్, థామస్, ప్రమోద్ పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ

**కంటోన్మెంట్, డిసెంబరు 11 ప్రభాతవార్త:** అయ్యప్ప స్వాములు కఠిన దీక్ష చేసి ఇరుముడి ధరించి శబరిమలై స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, మాజీ సభ్యులు పాండుయాదవ్, లోకనాథం తెలిపారు. బొల్లారం లోని గురుస్వామి నాగేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో 25వ అయ్యప్ప మహ పడి పూజ వేడుకలు వైభవంగా జరిగాయి. 18 మెట్ల పడిపూజలో భాగంగా, గణపతి పూజ వంటి ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో గురు స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సగర సంగం నూతన కార్యవర్గం నియామకం

**కూకట్‌పల్లి, డిసెంబరు 11, ప్రభాతవార్త :** జగద్గిరిగుట్ట సగర సంగం నూతన కార్యవర్గం నియామకం జరిగింది. నూతన అధ్యక్షులుగా వేముల సుదర్శన్‌సాగర్, ప్రధాన కార్యదర్శిగా సూరాయపల్లి భీమయ్య సాగర్, కోశాధికారిగా మోడల వెంకటరమణ సాగర్, స్టీరింగ్ కమిటీ చైర్మన్ కేపీ రామ్‌సాగర్, వైస్ చైర్మన్‌గా మోడల రాములుసాగర్, స్టీరింగ్ కమిటీ సభ్యు లుగా కేపీ రాములుసాగర్, ఏ శ్రీనివాస్‌సాగర్(రాచాల), ఏ.శ్రీనివాస్‌సాగర్ (కన్మనూరు), ఏ.వెంకటస్వామిసాగర్, ఏ.మారుతిసాగర్, బంగారు నరసింహ సాగర్, ఆర్కే దయ సాగర్, సిహెచ్ శ్రీనివాస్ సాగర్, డి గోపాల్ సాగర్, డి శ్రీరాములు సాగర్, ఎస్ గంగాధర్ సాగర్, ఏ కొండయ్య సాగర్, ఎన్ రామకృష్ణ సాగర్, కె వెంకటేష్ సాగర్, ఉపాధ్యక్షులుగా ఇన్ చంద్రశేఖర్ సాగర్, కే రాజేష్ సాగర్, ఎం కృష్ణసాగర్ ఎం వెంకటకృష్ణ సాగర్, జి ఆంజనేయులు సాగర్, కె.పి శివసాగర్, సంయుక్త కార్యదర్శులుగా ఆర్. చంద్రమోహన్ సాగర్, ఎం. బాలరాజు సాగర్, జి. ప్రవీణ్ సాగర్, సిహెచ్ శ్రీనివాస్ సాగర్, ఉప కోశాధికారులుగా జి లక్ష్మీ ...్మనాథ్ సాగర్, కే శేఖర్ సాగర్, జి కృష్ణ సాగర్, డి భాస్కర్ సాగర్, కార్యనిర్వహణ కార్యదర్శిలుగా ఎం రామాంజనేయులు సాగర్, కే ఆంజనేయులు సాగర్, ఎమ్మెస్ శ్రీనివాస్ సాగర్, ప్రచార కార్యదర్శులుగా ఎం పరమేష్ సాగర్, ఏ రవి సాగర్, కార్యవర్గ సభ్యులుగా బి నాగరాజు సాగర్, జి వెంకటేష్ సాగర్, జి మనోజ్ సాగర్, సిహెచ్ ప్రకాష్ సాగర్ తదితరులు ఎన్నికయ్యారు.

## వైభవంగా సాగుతున్న గుండం బాలాజీ బ్రహ్మోత్సవాలు

**అల్వాల్, డిసెంబరు 11 ప్రభాతవార్త:** దేవుని అల్వాల్‌లోని చారిత్రాత్మక మైన గుండం బాలాజీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలులో భాగంగా గురువారం హోమం ఇతర పూజలు చేయడం జరిగింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు పరాంకుశం మాధవా చార్యులు, క్రిష్ణమాచార్యులు పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.

## బ్రూక్‌బాండ్ కాలనీ అభివృద్ధికి కృషి : బానుక నర్మద

**కంటోన్మెంట్, డిసెంబరు 11 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ 5వ వార్డు బ్రూక్ బాండ్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు శాశ్వత మరమ్మతులు చేపడుతున్నామని బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మదమల్లికార్జున్ తెలిపారు. గురువారం కాలనీ ప్రతినిధులు బోర్డు మెంబర్ నర్మదను కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను ఆమె దృష్టికి తెచ్చారు. తన దృష్టికి తెచ్చిన సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరి స్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సి.పి.ఎస్.ప్రకాశ్, ప్రతినిధులు ప్రభాకర్ రావ్, శశిధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న కావలి గణేష్ తదితరులు

## ప్రజా సమస్యలు పరిష్కరించండి

### మాజీ సర్పంచ్ కావలి గణేష్

**దుండిగల్, డిసెంబరు 11, ప్రభాతవార్త :** దుండిగల్ మున్సిపాలిటీ, డబుల్ బెడ్రూమ్ కాలనీలో ఎస్‌టిపి సమస్యపై గురువారం ఉమ్మడి కుత్బు ల్లాపూర్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షులు, దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ మేడ్చల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఆపరేషన్స్) పి. కరుణాకర్ బాబుకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుండిగల్ గ్రామ పరిధిలోని డబుల్ బెడ్రూమ్ సముదాయంలో నివసిస్తున్న సుమారు 3990 మంది లబ్ధిదా రులు కొద్దికాలంగా సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ సమస్యతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్య కారణంగా కాలనీ లో దుర్వాసన, దోమల వ్యాప్తితో ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొం టున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. త్వరగా ఈ సమస్యను పరిష్క రించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక దుండిగల్ మాజీ ఎంపిటీసీ బండారి మహేష్, దొంతి మహేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ మల్క కొమురయ్యకు సన్మానం

**కంటోన్మెంట్, డిసెంబరు 11 ప్రభాతవార్త:**



ఎమ్మెల్సీ మల్క కొమురయ్యకు సన్మానిస్తున్న బానుక నర్మద

ఎమ్మెల్సీ మల్క కొమురయ్య గురువారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా నామినేటెడ్ బోర్డు మెంబర్ బానుక నర్మద ఆయనకు శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించింది. అనంతరం బోర్డు జాయింట్ సిఈఓను, సిబ్బందిని, అధికారులను పరిచయం చేయించారు. కార్యక్రమం లో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బానుక మల్లికార్జున్ పాల్గొన్నారు.

## ఘనంగా రామశర్మ వర్ధంతి వేడుకలు

**సంజీవరెడ్డినగర్, డిసెంబర్ 11 ప్రభాతవార్త:** సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమా తండ్రి కె.వి.ఎస్. రామ శర్మ వర్ధంతి సందర్భంగా బాపూజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో తన తల్లి ఉమా శర్మతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీలిమా మాట్లాడుతూ సామాజిక సేవా పట్ల అయనకున్న నిబద్ధతను స్మరించుకుంటూ అన్నదానం చేయడం తమ ధర్మంగా భావిస్తున్నామని తెలిపారు. మన సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరికి ప్రేమ, సేవ, సహకారం చూపాలని నా తండ్రి ఎప్పుడూ చెప్పేవారన్నారు.ఈ కార్యక్రమంలో సనత్ నగర్ నియోజకవర్గ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాపూజీ నగర్‌లో అన్నదాన కార్యక్రమంలో కోట నీలిమ

# నగరం వేదికగా మహా సాంస్కృతిక వేడుక

### 19 నుంచి 21 వరకు హైడ్.ఆర్ట్ 2025 కళా ప్రదర్శన.. ప్రదర్శనలో ఎంఎఫ్ హుస్సేన్, ఎస్ హెచ్ రజా కళాకృతులు

**జూబ్లీహిల్స్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**

భారతీయ సాంస్కృతిక వేడుకకు నగరం వేదిక కానుంది. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సాం స్కృతిక వేడుకల్లో ఒకటైన హైడ్.ఆర్ట్ 2025 కళా నగరం సిద్ధమవుతుంది. మూడు రోజుల పాటు జరిగే కళా, సాంస్కృతిక మహోత్సవం ఈ నెల 19 నుంచి 21 వరకు నానక్‌రామ్‌గూడ లోని ఈయాన్ హైదరాబాద్‌లో జరగనుంది. ఈ సంద ర్భంగా కావూరి హిల్స్ లోని ఏక్‌చిత్ర ఆర్ట్ గ్యాలరీ లో విలేఖరుల సమావేశంలో హైడ్.ఆర్ట్ షో డైరెక్టర్ అన్నపూర్ణ మడిపడిగ, వ్యవస్థాపకుడు హసన్, ప్రముఖ కళాకారుడు ఎ రాజేశ్వరరావు, ప్రముఖ కళాకారిణి పద్మారెడ్డి, బిజినెస్ హెడ్ సాయి రామ్‌రెడ్డి, నవనామి ప్రాజెక్ట్స్ డైరెక్టర్ కృష్ణకాంత్ కోటగిరి కార్యక్రమ వివరాలను వెల్ల డించారు. హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 200 మందికి పైగా కళాకారులు తమ కళాఖండాలను ఇక్కడ ప్రదర్శిస్తారన్నారు. సమ కాలీన కళ, యువ కళాకారుల కృతులు, జానపద సంప్రదాయాలు, క్యూరేటెడ్ గ్యాలరీలు, వర్క్ షాప్‌లు, ఆర్ట్ సంభాషణల సమ్మేళనాన్ని ఇక్కడ అందిస్తున్నామన్నారు. ప్రముఖ కళాకారులు ఎం ఎఫ్ హుస్సేన్, ఎస్ హెచ్. రజా వంటి ఆధునిక భారతీయ దిగ్గజాల అరుదైన, ముఖ్యమైన కళా కృతులుప్రదర్శించనున్నట్లు వివరించారు.ప్రదర్శన లో హైదరాబాద్‌కు చెందిన 30 మంది ప్రముఖ కళాకారులు, దేశవ్యాప్తంగా ఉన్న 30 మంది యువ కళాకారులు పాల్గొంటారన్నారు. తెలుగు కళాకా రుల కృతులకు అంకితమిస్తూ కీర్తనం తెలుగు లెజెండ్స్‌కు నివాళి పేరుతో ప్రత్యేక ప్రదర్శన ఉంటుందన్నారు. మరో ప్రధాన విశేషం మిథిలా కళకు చెందిన మూడుతరాల కళాకారుల సృజనా త్మక ప్రయాణ ప్రదర్శన, మూడు రోజుల పాటు సందర్శకులు వివిధ ప్యానల్ చర్చలు, ప్రెజెంటే షన్లు, వర్క్‌షాప్‌లు వంటి అనేక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.




వివరాలు వెల్లడిస్తున్న హసన్, నవీన్, అన్నపూర్ణ, వెంకటనవీన్, రాజేశ్వరరావు, పద్మారెడ్డి



మాట్లాడుతున్న రామక్రిష్ణ

## అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయాలి

### బిజెపి రాష్ట్ర కార్య వర్గసభ్యుడు రామక్రిష్ణ

**కంటోన్మెంట్, డిసెంబరు 11 ప్రభాతవార్త:**

రెండేళ్ల కాంగ్రెస్‌పాలనలో ఏమి అభివృద్ధి చేశారో సిఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ శ్వేతపత్రం విడుదల చేయాలని బిజెపి రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్య క్షుడు జె.రామక్రిష్ణ డిమాండ్ చేశారు. గురువారం మహేంద్రహిల్స్‌లోని కార్యాలయంలో ఆయన మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ లను ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. గ్రేటర్‌లోని ఏ నియోజకవర్గానికి ఎంతెంత నిధులు విడుదల చేశారో తెలియజేయాలని డిమాండ్ చేశారు. రైతుభరోసా అని రైతులను మోసం చేసిందన్నారు. కంటోన్మెంట్‌లో స్థానిక లబ్ధిదారులకు నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లను నేటికీ లబ్ధిదారులకు అంద జేయలేదని విమర్శించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఫ్యాషన్ షో చేస్తున్నాడని ఆరోపించారు. కంటో న్మెంట్‌పై చిత్తశుద్ధి ఉంటే కనీసం తాగేనీళ్ల అయినా తీసుకు రాలేదని చెప్పారు.ఎస్సీ రిజర్వుడ్ అయినా కంటోన్మెంట్ అభివృద్ధికి అదనపు నిధులు తీసుకురాలేదని తెలిపారు.కంటోన్మెంట్‌లో స్పోర్ట్స్ స్టేడియం నిర్మిస్తామని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నెలకొల్పుతా మని ఇచ్చిన మాటల్లో ఏ ఒక్కటి అమలు చేయ లేదన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉత్సావాలు జరుపుకుంటు న్నారని ఎద్దేవ చేశారు. కార్యక్రమంలో ఆయా వార్డు అధ్యక్షులు రాఖేశ్, అరుణ్, సచిన్, బి.సంతోష్, పవన్, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్‌గా బాలరాజు

**గచ్చిబౌలి, డిసెంబరు 11 ప్రభాతవార్త :** సైబరాబాద్ కమిషనరేట్ పరిధి లోని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా ఇన్స్‌పెక్టర్ కె.బాలరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆర్‌జిఐ ఎయిర్‌పోర్టు ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన బాలరాజు బదిలీలో భాగంగా గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ గా నియమితులయ్యారు. ఇప్పటివరకు గచ్చిబౌలి ఇన్స్‌పెక్టర్‌గా పనిచేసిన హబీబుల్లాఖాన్ సైబరాబాద్ విఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గురువారం బాలరాజు బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఓ భూవివాదంలో కేసు నమోదు చేసిన కారణంగానే హబీ బుల్లాఖాన్ మీద బదిలీ వేటు పడిందనే ప్రచారం జరిగడం సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన సందర్భం గా ఇన్స్‌పెక్టర్ బాలరాజు మాట్లాడుతూ గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో శక్తివంచన లేకుండా పనిచేస్తామని అన్నారు. ప్రజలకు ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో సేవలు అందిస్తామని తెలిపారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ, అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థలు ఉన్నా యని, సంస్థలు, ఉద్యోగుల భద్రతకు ఉన్నతాధికారుల సహకారంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్స్‌పెక్టర్ బాలరాజుకు ఎస్‌ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## రూ.21 లక్షలతో డివిజన్‌లో ప్యాచ్ వర్కులు పూర్తికి చర్యలు

### గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

**చిక్కడపల్లి డిసెంబరు 11 (ప్రభాతవార్త) :** గాంధీనగర్ డివిజన్‌కు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మంజూరు చేసిన రూ: 21 లక్షల నిధు లను నూతన సిసి రోడ్డు ప్యాచ్ వర్కులకు వినియోగించడం జరుగుతుందని కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. గురువారం చిక్కడపల్లి, వివేక్ నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయం వద్ద చేపడుతున్న రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను పరిశీలించారు. గత రాత్రి కార్పొరేటర్‌ఎ కార్పొరేటర్ అర్ధరాత్రి 11;30 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా అక్కడికి చేరుకొని, సిసి రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను పరిశీలించారు. అక్కడే వున్న జిహెచ్‌ఎంసి అసిస్టెంట్ ఇంజనీరింగ్ అబ్దుల్ సలామ్‌తో కార్పొరేటర్ మాట్లాడుతూ, అర్ధరాత్రి సమ యంలో కాంట్రాక్టర్‌తో పాటు వుండి పనులను జరిపిస్తున్నందుకు ఎఈని అభినందించారు.ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో వుండడమే కాకుండా, డివిజన్‌లో జరిగే అభివృద్ధి పనులను పటిష్టంగా జరిగేందుకు సమయంతో పనిలేకుండా అర్ధరాత్రి కూడా పనులను తనిఖీలు చేసేందుకు కార్పొరేటర్ గా ముందుంటానని అన్నారు. అర్ధరాత్రి కార్పొరేటర్ ను చుసిన పలువురు స్థానికులు అభివృద్ధి పనులపై కార్పొరేటర్‌కు వున్న ఆసక్తి పై హర్షం వ్యక్తం చేశారు. బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బిజెవైఎం నాయకులు జి.అరుణ్ కుమార్,జ్ఞానేశ్వర్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

## దృష్టిలోపం చిన్నారుల సందడి

**జూబ్లీహిల్స్, డిసెంబరు 11, ప్రభాతవార్త :** ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశా లకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఫర్ విజన్ రిహాబిలిటేషన్ (ఐవీఆర్) ఆధ్వర్యంలో దృష్టి లోపం ఉన్న పిల్లలు, వాళ్ల తల్లితండ్రులు శంకరపల్లివద్ద ఉన్న 30 ఎకరాల విస్తీర్ణంలోఉన్న వైల్డ్ వాటర్స్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో గురువారం సందడి చేశారు. నాలుగు వందల మంది దృష్టి లోపం ఉన్న పిల్లలు ఇందు లో పాల్గొన్నారు. ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు, రైడ్లతో సరికొత్త ప్రపంచంలో తేలియాడారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఒక్యులరిస్టీ లాబొ రేటరీ హెడ్ డాక్టర్ తర్జని దవే మాట్లాడుతూ.. సాధికారత, ఆత్మవిశ్వాసం, సామర్థం పిల్లల్లో పెంపొందించేందుకు ఉద్దేశించిన కార్యక్రమం అన్నారు. పిల్లల ఇంద్రియాలను, సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాలు ప్రత్యేకంగా రూపొందించామన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ విజన్ రిహాబిలిటేషన్ హెడ్ డాక్టర్ బ్యూలా క్రిస్టీ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లులు, మనసువిప్పి మాట్లాడటం, తమపిల్లల బలాలను చూడటం ఎంతో ఆనందం గా ఉందన్నారు. రిహాబిలిటేషన్ అనేది కేవలం నేర్చుకోవడం, స్వతంత్రత మాత్రమే కాదన్నారు. భావోద్వేగ సహాయం, సమూహ బలం అని అన్నారు.

## 14న శిల్పారామంలో 'నృత్య హేమంతం'

**చిక్కడపల్లి డిసెంబరు 11 (ప్రభాతవార్త) :** ప్రముఖ సాంస్కృతిక సంస్థ నృత్యమాల అకాడమీ ఆధ్వర్యంలో "నృత్య హేమంతం" పేరిట ఒక ప్రత్యేక నృత్య కార్యక్రమాన్ని 14 డిసెంబర్, ఆదివారం సాయంత్రం మాదాపూర్ శిల్పారామంలో నిర్వహించనున్నట్లు సంస్థ సంచాలకులు, ప్రముఖ నృత్య గురువు నిష్టల సుధామాల తెలిపారు. "నృత్య హేమంతం" ఒక అపూర్వ సంగమమని, ఈ కార్యక్రమములో జపాన్ మరియు భారత దేశ నృత్య కళాకారులు ఒకే వేదికపైన నృత్య ప్రదర్శనలు ఇవ్వడం ఒక ప్రత్యేకత అని సుధామాల వివరించారు. ఈ కార్యక్రమానికీ చెందిన పోస్టర్ (గోడపత్రిక)ను గురువారం నాడు సంస్థ కార్యాలయంలో నవ్య నాటక సమితి అధ్యక్షులు వేమరాజు విజయకుమార్, నిష్టల సుధామాల, నృత్యకళాకారిణులు కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో జపాన్ నగోయ నగరానికి చెందిన నర్తకీమణి యుకియే సాతో తన బృందంతో కలిసి "ఒడిస్సీ" నృత్యాన్ని ప్రద ర్శిస్తారని, అనంతరం హైదరాబాద్‌కు చెందిన నృత్యమాల అకాడమీ యువ కళాకారులు "కూచిపూడి" నృత్యాన్ని ప్రదర్శిస్తారని ఆమె వివరించారు. ఈ పోస్టర్‌ఆవిష్కరణ కార్యక్రమంలో బి.ఎస్.మేఖల పాల్గొన్నారు.

## మరో 5 రోజులు తీవ్రమైన చలిగాలులు

### అవసరం ఉంటేనే బయటకు రండి.. వాతావరణ శాఖ

**హైదరాబాద్, డిసెంబరు 11 ప్రభాతవార్త:** మహానగరం గజగజా వణుకు తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సాధారణ శీతాకాలం ఉష్ణోగ్ర తల కంటే 3 నుంచి 5 డిగ్రీల వరకు తక్కువగా నమోదవుతోంది. శివారు ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ రికార్డు అవుతోంది. మరోవైపు ఉదయం 8గంటల వరకు పొగమంచు వీడటం లేదు. దీంతో రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు తప్పడంలేదు. నగటు ఉష్ణోగ్రత 13.2డిగ్రీలు నమోదు కాగా, రాజేంద్రనగర్ లో 9.5,పటాన్‌చెరువు 7.8 హయత్‌నగర్‌లో 10 డిగ్రీలుగా నమోద య్యాయి. గురువారం నుంచి చలి తీవ్రత మరింత పెరుగుతుందని హైదరా బాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరో 5 రోజులు తీవ్రమైన చలి గాలులు వీస్తాయని తెలిపింది.చలి తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఉదయం పూట ప్రయా ణాలు సాధ్యమైనంత వరకు వాయిదా వేసుకోవడం మంచిది అంటున్నారు.

## సిఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**హైదరాబాద్ డిసెంబరు 11 ప్రభాతవార్త:** సిఎంఆర్‌ఎఫ్‌ను సద్విని యోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం అంబర్‌పేటకు చెందిన ఖలీల్ అబ్దుల్ కుటుంబ సభ్యులకు ఆయన ఎల్‌ఓసి పత్రాలు అందజేశారు. నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అతనికి 2.75లక్షల విలువైన వైద్యాన్ని ఈ పత్రాల ద్వారా పొందవచ్చన్నారు.

# రాష్ట్రపతికి రాచబాట

17 నుంచి 22 వరకూ




## బొల్లారానికి బోలెడు హంగులు
## బస ప్రదేశం వరకూ కొత్త రోడ్డు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 11, ప్రభాతవార్త : శీతాకాల విడిది కోసం ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నగరంలోని బొల్లారం రాష్ట్రపతి నిలయానికి చేరుకోనున్నారని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఇందుకోసం మేడ్చల్ జిల్లా పరిధిలోని హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు ప్రత్యేక విమానంలో రానున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి పర్యటనకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో కలెక్టర్ రాష్ట్రపతి రాక సందర్భంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రపతి రాక సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగ నిర్వహించాలన్నారు. 17న రాష్ట్రపతి హకీంపేట్ ఎయిర్‌పోర్టు నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంకు రోడ్డు మార్గం ద్వారా వెళ్తారని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ జిల్లా అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



ఏర్పాట్లపై సమీక్షా సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి, ఇతర అధికారులు

తిరిగి వెళ్లే వరకు అప్రమత్తంగ ఉండాలన్నారు. హకీంపేట్ ఎయిర్‌పోర్టులో జిల్లా అటవీశాఖ అధికారి ఆధ్వర్యంలో మంచి మొక్కలు, ప్లాంటేషన్ చేయటంతో పాటు రాష్ట్రపతి వెళ్లే సమయంలో రోడ్లకు ఇరువైపుల అందమైన మొక్కలను ఏర్పాటు చేయాలన్నారు. ఎయిర్‌పోర్టుతో పాటు ఆయా ప్రాంతాల్లో అవసరమైన చోట్ల మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయిచాలని తూకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతికి సూచించారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో పాటు అవసరమైన మందులు, మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలని డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరికి సూచించారు. బొల్లారం రోడ్డు మార్గంలో రోడ్డు గుంతలను పూడ్చటం కానీ, కొత్త రోడ్డు వేయటం కానీ చేయాలన్నారు. విద్యుత్ సరఫరా నిరంతరాయంగ ఉండాలన్నారు.

- హకీంపేట్ ఎయిర్‌పోర్టులో స్పెషల్ గార్డెనింగ్
- రోడ్లకు ఇరువైపుల అందమైన మొక్కలతో అలంకరణ
- అవసరమైన చోట మొబైల్ టాయిలెట్లు
- నిరంతర విద్యుత్ సరఫరా
- అత్యవసరానికి జనరేటర్
- అందుబాటులో అగ్నిమాపక యంత్రం
- ఏర్పాట్లపై శాఖాధికారులకు కలెక్టర్ ఆదేశం



హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డీజీపీ ఎకె ఖాన్, జావెద్ హుడ్, హుదయతుల్లా తదితరులు

# విజయోత్సవాలు వద్దు

**మూడు దశల పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకూ కోడ్ కొనసాగుతుంది**

**నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు**

**ఎస్‌పి స్నేహ మెహ్రా స్పష్టీకరణ**

వికారాబాద్, డిసెంబరు 11, ప్రభాతవార్త : ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవాలు నిషేధమని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చినా ర్యాలీలు, బైక్ శోభా యాత్రలు నిర్వహించరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో



మూడు దశల పంచాయతీ ఎన్నికల పూర్తి ప్రక్రియ ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోనే కొనసాగుతుందని చెప్పారు. తొలి దశ ఫలితాలు వచ్చినా గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులతో విజయోత్సవ ర్యాలీలు, భారీ సభలు, బైక్ ర్యాలీలు, శోభాయాత్రలు, డీజేలు వంటి వేడుకలు నిర్వహించడం పూర్తిగా నిషేధమన్నారు.. కోడ్ కొనసాగుతున్నంతకాలం ఈ ఆంక్షలను తప్పని సరిగా పాటించాల్సిందేనన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియ సజావుగా సాగాలంటే నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.

## అన్నపై తమ్ముడి విజయబావుటా

**నందిగామలో కాంగ్రెస్ అభ్యర్థి విజయం**



నందిగామ, డిసెంబరు 12, ప్రభాతవార్త : నందిగామ పంచాయతీకి కొమ్ము బ్రదర్స్ మధ్య జరిగిన బిగ్ ఫైట్‌లో తమ్ముడే విజయకేతనం ఎగురవేశారు. అన్నతో హోరాహోరా తలబడి సర్పంచ్ కుర్చీని కొమ్ము కృష్ణ కైవసం చేసుకున్నారు. కాంగ్రెస్ బలపరిచిన కొమ్ము కృష్ణ బిఆర్ఎస్ మద్దతు తెలిపిన కొమ్ము వెంకటయ్యపై 949 ఓట్ల మెజార్టీతో ఆధిక్యతను చాటారు. దీంతో కొమ్ము కృష్ణ అనుచరులు మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ప్రతిష్టాత్మకంగా మారిన ఈ ఎన్నికల్లో నువ్వా నేనా రీతిలో ఉత్కంఠ భరితంగా పోరు సాగింది.

సిఎం ఇలాకాలో

# కాంగ్రెస్ హవా

**అధిక స్థానాల్లో అధికార పార్టీ మద్దతుదారులకు పట్టం**



పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్, డిసెంబరు 11 ప్రభాతవార్త : గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా గురువారం జరిగిన మొదటి విడుత ఎన్నికల్లో కొడంగల్ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. మండలంలో 25 గ్రామపంచాయతీలకు గాను టేకుల్‌కోడ్ గ్రామ సర్పంచ్ వార్డు సభ్యుల ఏకగ్రీవంతో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుడు చెట్టుకిందిరాజు సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం పాఠకులకు విదితమే. గురువారం జరిగిన 24 గ్రామ పంచాయతీ ఎన్నికలకు గాను మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్లు లెక్కింపు చేపట్టారు.

ఇందులో అంగడిరైచూర్ గ్రామ సర్పంచ్‌గా కుమ్మరి సౌభాగ్యలక్ష్మి (కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి)గా ఎన్నికైయ్యారు. అలాగే అన్నారంలో బైండ్ల నర్సప్ప (కాంగ్రెస్) సంగాయపల్లి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు (స్వతంత్ర), చిన్ననందిగామ దత్తాత్రేయరావు (కాంగ్రెస్) హుస్సేన్‌పూర్ దొడ్ల అంజిలయ్య (కాంగ్రెస్) ఖజాఅహ్మద్‌పల్లి ల్యాగల అనురాధ(కాంగ్రెస్), పెద్దనందిగామ చెన్‌బసు (కాంగ్రెస్) ప్యాలమద్దీ యాసర్ మొహ్మద్ (స్వతంత్ర) ఇందనూర్ గడ్డం నర్సమ్మ (కాంగ్రెస్) కస్తూర్‌పల్లి లక్ష్మీణ్‌గౌడ్ (కాంగ్రెస్) పాటుమీదిపల్లి కవిత (కాంగ్రెస్), అప్పాయిపల్లి బొద్రాయి వెంకటయ్య (కాంగ్రెస్) నాగారం పట్లోళ్ళ ప్రశాంతి (కాంగ్రెస్) పోశమ్మతండా ముడావత్ సునిత (కాంగ్రెస్) బోయపల్లి తండా రమేష్‌నాయక్ (కాంగ్రెస్) పల్గురాళ్ళ తండా మోత్యా నాయక్ (కాంగ్రెస్) ఉడిమేశ్వరం కుమ్మరి శ్రీనివాస్(కాంగ్రెస్) చిట్లపల్లి జ్యోతి (కాంగ్రెస్), బోనమ్మతండా కిష్టిభాయి (కాంగ్రెస్) అభ్యర్థులు విజయం సాధించారు. కాగా మండలంలోని రుద్రారం, హస్నాబాద్, రావులపల్లి, పర్సాపూర్ గ్రామాలకు సంభందించిన ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. ఫలితాలు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# పంచాయతీ అంచనాలు పటాపంచలు





షాద్‌నగర్‌లో విజేతల సంబరాల దృశ్యం

- షాద్‌నగర్‌లో అనుకున్నదొక్కటి అయినది ఒక్కటి
- ఎమ్మెల్యే సొంత గ్రామం వీర్లపల్లిలో కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి ఓటమి
- బిఆర్ఎస్‌కూ తప్పని భంగపాటు
- ఊహించని రీతిలో పంచాయతీ ఫలితాలు
- నియోజకవర్గంలో 153 పంచాయతీలు
- 6 ఏకగ్రీవం(కాంగ్రెస్)
- పోటీలో 79 స్థానాలతో సరిపెట్టుకున్న కాంగ్రెస్
- 64 చోట్ల బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు విజయం
- 2 బిజెపి, 1 టిడిపి, 1 తటస్థం

షాద్‌నగర్, డిసెంబరు 11, ప్రభాతవార్త: అనుకున్నదొక్కటి.. అయినది ఒక్కటి.. బోల్తా కొట్టిందిలే బుల్బుల్ పిట్ట.. అన్న రీతిలో కోటి అంచనాలతో రంగంలోకి దిగి లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రచారాలు చేసుకున్న నాయకులు చివరి నిమిషంలో అంచనాలు తలకిందులై ఓటమిపాలయ్యారు.. ఏ అంచనాలు లేకుండా రంగంలోకి దిగి ఒక్కొక్క మెట్టు ముందుకు సాగుతూ వెళ్లిన నాయకులు గెలుపు వాకిట నిలిచి ఆశ్చర్యపరిచారు.. కొన్నిచోట్ల నువ్వా.. నేనా అన్న రీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య పోటీ సాగగా.. మరికొన్నిచోట్ల నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. షాద్ నగర్ నియోజకవర్గంలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య రసవత్తరంగా సాగిన ఈ ఎన్నికల ఆటలో ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ఒక్కోచోట ఒక్కొక్కరు బాగా వేశారు. ఒకరి కోటను మరొకరు బద్దలు కొట్టారు.
ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సాగిన పోటీలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గ్రామాల్లో పార్టీ ఆధిపత్యాన్ని చాటేందుకు ముందుకు నడవగా, బీఆర్ఎస్ తరఫున రెండు వర్గాల మధ్య పోరు కొనసాగింది. అంజయ్య యాదవ్ మద్దతుదారులు, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మద్దతుదారులుగా ఒక్కోచోట ఇద్దరు రంగంలోకి దిగిన గ్రామాలు చాలా ఉన్నాయి. ఎవరికివారుగా ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తు చేస్తూ ముందుకు సాగిన ఈ ఆటలో కొన్నిచోట్ల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన సత్తా చాటగా, ఇంకొన్ని చోట్ల ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఆదిపత్యాన్ని కనబరిచారు. అంజయ్య యాదవ్ తన స్వగ్రామంతో పాటు తన మద్దతుదారులను కొంతమందిని గెలిపించుకోగలిగాడు. ఇలా ఎవరి వ్యూహాల్లో వాళ్ళు అటు విజయాలను, అపజయాలను కూడా చవిచూశారు. లింగారెడ్డిగూడెంలో తెలుగుదేశం మద్ద తుతో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడం విశేషం. ఇక ఎమ్మెల్యే స్వగ్రామమైన నందిగామ మండలం వీర్లపల్లిలో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మద్దతుదారు విజయం సాధించడం చర్చనీయాంశమైంది. పలుచోట్ల కాంగ్రెస్ బీఆర్ఎస్ మద్దతుదారుల మధ్య ఉత్కంఠభరితమైన కోరుకున్న సాగింది. కొందుర్గు మండలం చిన్న ఎల్కిచర్లలో ఇద్దరు అభ్యర్థులకు సమాన ఓట్లు రావడంతో టాస్‌తో విజేతను నిర్ణయించాల్సి వచ్చింది. గెలుస్తారని ఊహించిన అభ్యర్థులు ఓడిపోవడం, ఊహించని అభ్యర్థులు గెలవడం చాలా చోట్ల కనిపించింది.

**అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే..**

చాలామంది అభ్యర్థులు సర్పంచ్ ఎన్నికలకు మామూలుగా ఖర్చు చేయలేదు.. పలుచోట్ల కోటి రూపాయలు అంతకుమించి ఎన్నికల కోసం ఖర్చు చేశారు. కానీ ఫలితాలు మాత్రం వారికి భిన్నంగా రావడంతో ఉసురుమంటున్నారు. ప్రతిరోజు భోజనాలు, కానుకలు, మద్యం, డబ్బులు ఇలా అభ్యర్థులకు అలవాటు చేసి ఎవరికి వారుగా గ్రామాల్లో గత వారం పది రోజులుగా ఒక పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఎవరికి వారే తమ గెలుపుపై ధీమా పెట్టుకున్నారు. కానీ ప్రజలు మాత్రం తాము అనుకున్న అభ్యర్థినే గెలిపించి అంచనాలకు అందని తీర్పును ఇచ్చారు. అగ్ర నాయకులు వెళ్లి ప్రచారం చేసినా, డబ్బులు మద్యం వరదలై పారిన గెలుపు ముంగిట మాత్రం చాలా మంది బోల్తాపడ్డారు. ఏ అంచనాలు లేకుండా రంగంలోకి దిగిన వారు విజయం సాధించి వారిని ఆశ్చర్యంలో ముంచారు. ప్రస్తుతం విజయం సాధించిన అభ్యర్థులు ఆటపాటలు, ఊరేగింపులతో గ్రామాల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది.

# ఫారూక్‌నగర్‌లో 88.66 శాతం పోలింగ్

రంగారెడ్డి, డిసెంబరు 12, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం ఫరూక్ నగర్ మండలంలో గురువారం జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా నూతన సర్పంచులు ఎంపికయ్యారు. మండలంలో 88.66 శాతం ఓట్లు నమోదు అయ్యాయి. అదేవిధంగా పురుషులు మండలంలో 25396 మంది ఓటు హక్కు వినియోగించుకోగా మహిళలు 25,704 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ట్రాన్స్ జెండర్స్ నలుగురు, మొత్తం మొత్తం 51,104 ఓట్లు ఉండగా ఇందులో 45 వేల 308 ఓట్లు పోలయ్యాయి. మొత్తం 88.66 శాతం కోట్లు పోలయ్యాయి.

**నూతన సర్పంచులు వీరే....**

అన్నారం గ్రామ సర్పంచ్ గా లావణ్య, ఉప్పరిగడ్డ సర్పంచుగా చందు నాయక్, రంగంపల్లి గ్రామ సర్పంచ్ గా, కృష్ణవేణి, వెంకన్నగూడ సర్పంచ్ గా శకుంతల, రామేశ్వరం సర్పంచ్ గా మల్లేష్, కొండన్నగూడ సర్పంచ్ గా అనురాధ, పీర్లగూడ సర్పంచ్ గా షమీం బేగం, రాసు మల్ల గూడ సర్పంచ్ గా శివరాములు, గట్లవెల్లి సర్పంచ్ గా చక్కని శివకుమార్ యాదవ్, ఎలుకట గ్రామ సర్పంచ్ గా వాకిటి నవకిరిని, లింగారెడ్డి గూడా ఎంసీ రాజు, కడియాల కుంట తండా సర్పంచ్ గా రాజు నాయక్, దూసకల్ సర్పంచ్ గా జ్యోతి మహి, వెలిజెర్ల గ్రామ సర్పంచ్ గా బాబు నాయక్, భీమారం సర్పంచ్ గా గీత, రాయికల్ సర్పంచ్ గా జ్యోతి, విట్యాల గ్రామ సర్పంచ్ గా వెంకటయ్య, మొగలిగిద్ద సర్పంచ్ గా కృష్ణ, హాజీపల్లి సర్పంచ్ గా కుమార్, దేవుని బండ తండా సర్పంచ్ గా శ్రీను నాయక్, శేరిగూడ గ్రామ సర్పంచ్ గా శారద, కంసాన్ పల్లి గ్రామ సర్పంచుగా గీత, దేవునిపల్లి సర్పంచ్ గా లలిత, రంగంపల్లి సర్పంచ్ గా కృష్ణవేణి, చింతగూడ సర్పంచ్ గా నరేష్, కమ్మదనం గ్రామ సర్పంచ్ గా లత కిరణ్, మధురాపురం సర్పంచ్ శివారెడ్డి, నాగులపల్లి సర్పంచ్ రాధిక, నేరెళ్ల చెరువు సర్పంచ్ భూపాల్ యాదవ్, కాశిరెడ్డి గూడ సర్పంచ్ లింగం, బుచిగూడ గ్రామ సర్పంచ్ మల్లేష్ గౌడ్, చించోడు గ్రామ సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్, చౌలపల్లి సర్పంచ్ జంగయ్య, దొంతికుంట తండా సర్పంచ్ రవి నాయక్, కందివనం సర్పంచ్ జమున అమ్రూ నాయక్, కుందేలు కుంట తండా సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, మొండోరి రాయి తండా సర్పంచ్ తేజీయ నాయక్, పులిచెర్లకుంట తండా రాజు నాయక్, వెంకట్ రెడ్డి పల్లి సర్పంచ్ రమేష్, బూర్గుల సర్పంచ్ గా రాజ్ గోపాల్ రెడ్డి, పెద్ద చిలకమర్రి సర్పంచ్ గా రవీందర్ రెడ్డి, చిన్నచిలకమర్రి సర్పంచ్ గా యాదగిరి ఎంపికయ్యారు.

## పంచాయతీ పోరుకు ఖండాంతరాలు తరలివచ్చిన యువత

రంగారెడ్డి, (శంషాబాద్), డిసెంబరు 11, ప్రభాతవార్త: తొలి విడత స్థానిక సంస్థల పంచాయతీ పోరుకు యువత ఖండాంతరాల నుంచి తరలివచ్చారు. ఆస్ట్రేలియా, యూకే, కజకిస్తాన్ తోపాటు దేశంలోని కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు, ఐటీ ఉద్యోగులు పూణే, బెంగళూరు, బాంబే, నోయిడా తదితర ప్రాంతాల నుంచి యువత తమ ఓటు హక్కు వినియోగించేందుకు ఉత్సాహంగా రావడం జరిగింది. ఒకరోజు ముందుగానే తమ తమ స్వస్థలాలకు చేరుకున్నారు. గురువారం జరిగిన శంషాబాద్ మండలంలోని ఆయా పంచాయితీలలో తమ ఓటు హక్కు వినియోగించు కున్నారు. యూకే నుంచి వంశీ, ఆస్ట్రేలియా నుంచి ఆసాద్ మండలంలోని తమ సంస్థలను చేరుకొని ఓటు హక్కు వినియోగించుకోవడం జరిగింది. వైద్య విద్యార్థులు నీతూ, చందన, శిరీష, విష్ణు చైతన్య, రఘు వీర్ ప్రసాద్, మని మోహన్ ఓటు వేశారు. వృద్ధులు వికలాంగులు సైతం ఉత్సాహంగా తమ తమ కుటుంబీకుల ద్వారా వీల్ చైర్లపై వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. నరుకులలో భాజపా రాష్ట్ర నాయకులు బుగ్గ వేణుగోపాల్, మాజీ జెడ్పిటిసి నీరటి తన్వి రాజ్ ముదిరాజ్, మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.



# బతికి వస్తాం అనుకోలేదు

**-మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముందే దారుణంగా కొట్టారు**
**-బంగారు గొలుసు, ఫోన్లు లాగేసుకున్నారు**
**-తాము దాడులకు తెగబడితే పరిస్థితి వేరే విధంగా ఉంటుంది**
**-బీఆర్ఎస్ నాయకుడు దినేష్ సాగర్ ఆగ్రహం**

షాద్‌నగర్, డిసెంబరు 11, ప్రభాతవార్త: పార్టీ కోసం సేవ చేశాం.. మాజీ ఎమ్మెల్యే గెలుపు కోసం కృషి చేశాం.. అయినా మమ్ములను మనుషుల కింద కూడా లెక్క చేయలేదు. మెడలో బంగారు గొలుసు లాక్కొని, చేతిలో సెల్ఫోన్‌లు గుంజుకొని ఇష్టా రాజ్యాంగ కొట్టారు. తమ అహంకారాన్ని బయటపెట్టారు. అంటూ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి వర్గం నాయకులు దినేష్ సాగర్, కాట సుధీర్, మధుసూదన్ రెడ్డి తదితర నేతలు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌పై, ఆయన కుమారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. షాద్ నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వాళ్లు మాట్లాడుతూ కేశంపేట మండలం ఎక్లాస్ ఖాన్ పేటలో మాజీ ఎమ్మెల్యే వర్గీయులు సొంత పార్టీ కార్యకర్తలు అయిన తమపై దాడి చేయడం దారుణం అన్నారు. దినేష్ సాగర్ మాట్లాడుతూ తన మిత్రుడైన ప్రవీణ్ ఎన్నికల్లో పోటీ చేసిన నేపథ్యంలో అతడిని పలకరించేందుకు రాత్రి 8 గంటల సమయంలో వెళుతుండగా.. సుమారు 200 మంది వాహనాన్ని ఆపి తమపై దాడి చేశారని తెలిపారు. ఈ దాడిలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కుమారులు రవీందర్ యాదవ్, మురళి యాదవ్ కూడా ఉన్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డిని ఇష్టారాజ్యంగా బూతులు తిడుతూ తమపై దాడికి పాల్పడ్డారన్నారు. తాము ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా వాహనంలో వెళితే ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి డబ్బుల పంపిణీ కోసమే తమను పంపాడని పోలీసుల ముందు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే కళ్ళముందే తమను దారుణంగా కొట్టారని తెలిపారు. నవీన్ రెడ్డి వైపు ఉండడమే తమపై దాడికి కారణమని వారు వెల్లడించారు. దాడులు చేసిన వారిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు కూడా నమోదయిందని వెల్లడించారు. గ్రామంలో రాత్రి జరిగిన సంఘటనలో బతికి బట్ట కడతామని అనుకోలేదని అంత దారుణంగా కొట్టారని వాపోయారు. తాము కూడా దాడులకు తెగబడితే వారి పరిస్థితి ఏమవుతుందో అర్థం అవుతుందని హెచ్చరించారు. సమావేశంలో నేతలు శివా చారి, గోపాల చారి, జాన్సన్, మహేష్ గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



**ఎల్గనమోని బ్రదర్స్‌పై కేసు..!**

ఎక్లాస్ ఖాన్ పేటలో బుధవారం రాత్రి జరిగిన దాడి ఘటన నేపథ్యంలో బాధితుడు దినేష్ సాగర్ ఫిర్యాదు మేరకు మాజీ ఎంపిపి రవి యాదవ్ మరో యువ నాయకుడు వై.మురళి యాదవ్‌పై కిషంపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

# భళా ధీరావత్

**సౌత్ ఏషియన్ పారా త్రోబాల్‌లో భారత్‌కు సిల్వర్ మెడల్**

**ఇండియన్ కెప్టెన్‌గా ధీరావత్ మహేశ్‌నాయక్**

శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), డిసెంబరు 11, ప్రభాతవార్త : ఈ నెల 6వ తేదీ నుంచి 9వరకు శ్రీలంకలో జరిగిన సౌత్ ఏషియన్ పారా త్రోబాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారత్‌కు సిల్వర్ మెడల్‌ను కెప్టెన్ దివ్యాంగ క్రీడాకారుడు ధీరావత్ మహేశ్‌నాయక్ (లింగాపూర్‌తండ) జట్టు సాధించి పెట్టారు. గురువారం మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలంలోని లింగాపూర్ తండాకు చెందిన అంతర్జాతీయ దివ్యాంగ క్రీడాకారుడు ధీరావత్ మహేశ్‌నాయక్ పోటీల్లో పాల్గొని స్వగ్రామానికి విచ్చేసి ఈ విషయాన్ని తెలియజేశారు. ఈ పోటీలలో భారతదేశానికి కెప్టెన్‌గా ఎన్నుకోవటం జరిగిందని, నా నాయకత్వంలో ఈ పోటీల్లో భారతదేశం తరపున పాల్గొని బంగ్లాదేశ్, నేపాల్, ఇండోనేషియా, పాకిస్తాన్ జట్లను ఓడించినట్లు ఇక ఫైనల్‌లో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఓడినట్లు తెలిపారు. మొదటి స్థానంలో శ్రీలంక, రెండవ స్థానంలో భారతదేశం, మూడవ స్థానంలో బంగ్లాదేశ్‌లు నిలిచి ఈ టోర్నిని ముగించినట్లు తెలిపారు. ఈ పోటీలను 6న శ్రీలంకలోనే రత్నాపుర గవర్నర్ ప్రారంభించారని, 9న ముగింపు కార్యక్రమంలో విజేతలకు పథకాలను వరల్డ్ పారా త్రోబాల్ ఫెడరేషన్ ప్రసిడెంట్ నీలిమ రావత్ అందజేసినట్లు కెప్టెన్ ధీరావత్ మహేశ్‌నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు జనరల్ సెక్రటరీ అల్బర్ ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నట్లు వివరించారు. ఫైనల్‌కు చేరి రెండవస్థానంలో నిలిచినట్లు భారత్‌కు సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. అయితే తాను శ్రీలంకలో జరిగిన పోటీలకు వెళ్లటానికి మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి తరపున జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా చేయూతనందించారని కెప్టెన్ దివ్యాంగ క్రీడాకారుడు ధీరావత్ మహేశ్‌నాయక్ వారు దన్యవాదాలు తెలియజేశారు.



## ఓటమిని జీర్ణించుకోలేక ఆత్మాహత్యాయత్నం

కొడంగల్, డిసెంబర్ 11 ప్రభాతవార్త : గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటమిని జీర్ణించుకోలేక అభ్యర్ది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండల పరిధిలోని ఖాజా అహ్మద్‌పల్లిలో చోటుచేసకుంది. సంఘటనకు సంభందించి గ్రామస్థుల కథనం మేరకు గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా గ్రామ సర్పంచ్ స్దానానికి తెలుగు లక్ష్మీ పోటీ చేసింది. గురువారం మధ్యాహ్నం జరిగిన ఓట్ల లెక్కింపులో అమె ఓటమి చెందింది. ఓటమిని జీర్ణించుకోని లక్ష్మీ మనస్థాపంతో పురుగల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు అమెను కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

# మానసిక ఉల్లాసానికే క్రీడలు

**-నర్సాపూర్ ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి**



విష్ణు కప్ 2025 క్రీడల కార్యక్రమాన్ని ప్రారంబిస్తున్న నర్సాపూర్ ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి

**నర్సాపూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
క్రీడలు ఆరోగ్యాలతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని నర్సాపూర్ ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్ సమీపంలోని వైపర్ కళాశాలలో విష్ణు కప్ 2025 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ క్రీడలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంబించారు. ఈ క్రీడలు 10వ తేదీ నుండి 17వ తేదీ వరకు వారంరోజుల పాటు జరుగనున్నాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శరీరానికి ఎంతో మేలు కలగజేస్తాయన్నారు. ఈ మేరకు యువత వీడియో గేమ్స్‌కు బానిసలుగా మారకుండా వివిధ రకాల క్రీడాల్లో పాల్గొని ఆరోగ్యం పొందాలని సూచించారు. అనంతరం వైపర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఆటలను ఎంతో బాగా ఎంజాయ్ చేసుకుంటూ ఆడి క్రీడా స్ఫూర్తితో మెలగాలని అన్నారు. ఓటమికి నిరాశ చెంద కుండా తిరిగి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ క్రీడా పోటీల్లో విద్యార్థులకు క్రికెట్ బ్యాట్మెంటన్ త్రోబాల్, కబడ్డీ వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని పలు ఫార్మసీ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో వైపర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్, బివిఆర్ఐటి కళాశాల డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, విష్ణు పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ జ్యోతి, అడ్మిన్ డిపార్టెంట్ మేనేజర్ బాపిరాజు, సురేష్ వర్మ కొండల్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సూర్యం రజిత అధ్యాపక బృందం సాయికృప, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వామివారికి అరకిలో వెండి వస్తువుల బహూకరణ



స్వామివారికి అరకిలో వెండి వస్తువులను అందజేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లికార్జునస్వామికి అరకిలో వెండి వస్తువులను గురువారం అందజేశారు. అమీన్‌పూర్‌కు చెందిన తుమ్మల చంద్రశేఖర్‌రెడ్డి అనే భక్తుడు అరకిలో వెండివస్తువులను ఆలయ అధికారులకు అందజేశారు. స్వామివారి ఆలయానికి వెండివస్తువులను అందించిన చంద్రశేఖర్‌రెడ్డిని ఆలయ ఈవో వెంకటేష్ అభినందించారు. ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. దేవాలయ అభివృద్ధికి భక్తులు అందించే ఇలాంటి సేవాకార్యక్రమాలు ఎంతో ప్రేరణగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ముఖ్య అర్చకులు చిన్న మల్లికార్జున్, అర్చకులు మనోహర్, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణనిధి డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**-డిసిసిబి బ్యాంక్ మేనేజర్ ధనుంజయ**

**న్యాల్‌కల్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
డిసిసిబి బ్యాంక్ అమలు చేస్తున్న స్వర్ణనిధి డిపాజిట్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి బ్యాంక్ మేనేజర్ ధనుంజయ సూచించారు. గురువారం మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లోని డిసిసిబి బ్యాంక్‌లో స్వర్ణనిధి డిపాజిట్ సేకరణ కరపత్రాన్ని మేనేజర్ ధనుంజయ బ్యాంక్ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా బ్యాంక్ మేనేజర్ ధనుంజయ మాట్లాడుతూ స్వర్ణనిధి డిపాజిట్ సేకరణ మహోత్సవాన్ని డిసెంబరు 31వతారీఖు వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. 444రోజులు డిపాజిట్ చేసుకుంటే 7.75శాతం వడ్డీని అందుకుంటారని, అదే సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీని అందచేస్తామన్నారు. న్యాల్‌కల్ బ్యాంక్‌లో మొబైల్ బ్యాంకింగ్‌తోపాటు లాకర్స్ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. బ్యాంక్ అందిస్తున్నసేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ ధనుంజయ సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు ఉన్నారు.

## ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి బయటివారిని రానివ్వొద్దు

**-ఎన్నికల అధికారులకు ఆర్‌డిఓ పాండు సూచన**



ఎన్నికల పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్‌డిఓ పాండు

**చౌటకూరు, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
పంచాయతీ ఎన్నికలు పూర్తయి ఓట్ల లెక్కింపు సమయంలో బయటి వ్యక్తులను లెక్కింపు కేంద్రంలోకి రానివద్దని ఆర్‌డిఓ పాండు సూచించారు. గురువారం మండల కేంద్రమైన చౌటకూరులోని రైతువేదికలో పోలింగ్ సిబ్బందికి ఆర్‌డిఓ పలుసూచనలు చేశారు. ఓటర్లపట్ల అధికారులు సంయమనం పాటిస్తూ ఓర్పు, నేర్పు, సహనంతో మసలుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది, గ్రామాల్లోని బంధువులు, స్నేహితులు ఇళ్లకు వెళ్లకూడదన్నారు. నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. రీకౌంటింగ్ కోరే అభ్యర్థులనుంచి విధిగా దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కె. శంకర్, ఎంపిఓ సువర్ణ, ఈజిఎస్ ఎపిఓ రాములు, గోపికృష్ణ, మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రజాస్వామ్యానికి నిలువెత్తు నిదర్శనం రాజమ్మ




ఓటు హక్కు వినియోగించుకుని వస్తున్న 95 ఏళ్ల రాజమ్మ

**గుమ్మడిదల, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో నివసించే 95 ఏళ్ల రాజమ్మ అందరికీ ఆదర్శంగా నిలిచారు. శారీరకంగా బలహీనంగా ఉన్నప్పటికీ, వీల్‌చెయిర్ సహాయంతో పోలింగ్ కేంద్రానికి చేరుకుని తన ఓటు హక్కును వినియోగించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ఆమెకున్న గౌరవం, బాధ్యత గ్రామస్థులను ఎంతో ప్రభావితం చేసింది. పోలింగ్ బూత్ వద్ద రాజమ్మ కుటుంబసభ్యులు జాగ్రత్తగా తీసుకువచ్చి సహాయం చేశారు. పెద్ద వయసులో కూడా ఓటు వేయడానికి వచ్చిన ఆమెను చూసి అక్కడ ఉన్న అధికారులు, గ్రామస్థులు ప్రశంసల వర్షం కురిపించారు. వయసు ఎంతైనా ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదే అన్న సందేశాన్ని రాజమ్మ తన చర్యతో మరొకసారి నిరూపించారు.

## పంచాయతీ అభ్యర్థులకు ఎన్నికలపై అవగాహన



అవగాహన పొందుతున్న ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు

**సిర్గాపూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఆయా గ్రామ పంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికలఖర్చు, ఎన్నికల ప్రవర్తనానియమావళిపై గురువారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని రైతువేదికలో మండల అభివృద్ధి అధికారిణి శారదాదేవి, అసిస్టెంట్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ అరుణ్ కుల్‌కర్ణిలు అవగాహన కల్పించారు. 2011 జనాభా ప్రకారం, 5వేల కంటే తక్కువ జనాభాగల పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థులు రూ.1లక్ష50వేలు, వార్డుసభ్యులు రూ.30వేల లోపు ఎన్నికలను పురస్కరించుకుని ఖర్చులు చేసుకోవచ్చన్నారు. పంచాయతీ ఎన్నికలు ముగిసిన వెంటనే అభ్యర్థులు తమ వ్యయనిర్వహణ ఖాతావివరాలను అధికారులకు అందచేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగారం శ్రీనివాస్, ఎంపిఓ బ్రహ్మంచారి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలు అడిగి తెలుసున్న కార్పొరేటర్

**రామచంద్రాపురం, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఓల్డ్ రామచంద్రాపురం 4వ బ్లాక్‌లో నెలకొన్న సమస్యలను గురువారం కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ జిహెచ్‌ఎంసి జల మండలి మేనేజర్ లోకేష్, నాయక్, ఇంజనీరింగ్ సిబ్బందితో కలిసి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సుంకు స్వామి, రాజేష్, దశరథ్, రాజు, శోభ, పవన్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్‌ఎస్‌ఎస్-2023 సెక్షన్ అమలు

**-సిపి విజయ్‌కుమార్**

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష-2026కు గాను 9 పరీక్షాకేంద్రాల వద్ద 163 బిఎన్‌ఎస్‌ఎస్-2023 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని సిపి ఎస్ఎం.విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. దుబ్బాక వివేకానంద విద్యాలయం, ఎస్‌టి మేరీ విద్యానికేతన్-ప్రజ్ఞాపూర్, ఎస్‌టి జోసెఫ్ గర్ల్స్ హైస్కూల్ వాసవినగర్, ప్రభుత్వ హైస్కూల్ సిద్దిపేట, మెదక్ రోడ్డు ప్రభుత్వహైస్కూల్, కరీంనగర్‌రోడ్డు ప్రభుత్వ న్యూహైస్కూల్, హుస్నాబాద్ బాలురపాఠశాల, తెలంగాణ మోడల్‌హైస్కూల్ చేర్యాల పరీక్షాకేంద్రాల వద్ద ఈనెల 13 నుంచి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సెక్షన్ 163 బిఎన్‌ఎస్‌ఎస్ 2023 విధించినట్లు తెలిపారు. పరీక్ష సెంటర్ నుంచి 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రజలు గుమిగూడవద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు.

## ఉపసర్పంచ్‌లకు ధృవీకరణ పత్రాలు

**సిర్గాపూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మూడు గ్రామ పంచాయితీలకు ఉప సర్పంచ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల పరిధిలోని చందర్ నాయక్ తాండకు తావురా, కిషన్ నాయక్ తండాకు రాథోడ్ విఠల్, గైరాన్ తండా (ఎస్)లో లంబాడి దూరిబాయిలను ఉప సర్పంచ్‌లుగా ఎన్నుకుని నియామక పత్రాలను ఎంపిడిఓ గురువారం అందచేశారు.

## వంగదళ్‌లో మాజీ ఎమ్మెల్యే ప్రచారం

**సిర్గాపూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వంగదళ్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి పాండు, వార్డు అభ్యర్థులు అనిల్, రవి, గౌతమ్, నర్సింగ్, నాగప్పలకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి విజయపాల్‌రెడ్డి పంచాయితీ ప్రచారం చేశారు. బిజెపి మద్దతు పలికిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు శంకర్‌రావు పాటిల్ పాల్గొన్నారు.

## మార్డిలో ఘనంగా దత్తాత్రేయ జయంతి

**కల్హేర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మార్డిలో జిఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, బిఆర్‌ఎస్ నాయకులు గుట్టపు మచ్చేందర్ ఆధ్వర్యంలో గురువారం శ్రీ గురుదత్తాత్రేయ జయంతి వేడుకలను భక్తి శ్రద్దలతో గురువారం ఘనంగా జరుపుకున్నారు. జయంతి వేడులకు హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో తాజీ మాజీ ఎంపిపి అధ్యక్షులు గుట్టపు సుశీల అంజయ్య, కృష్ణాపూర్ తాజీ మాజీ ఎంపిటిసి సభ్యులు అంజయ్య సాగర్, బిఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నారెడ్డి, బిఆర్‌ఎస్ మద్దతుదారు సర్పంచ్ అభ్యర్థి గుట్టపు జ్ఞానేశ్వర్, మాజీ సొసైటీ ఛైర్మన్ గుట్టపు జలంధర్, వెంకన్న, గుట్టపు బాలరాజ్, గుట్టపు సాయిలు, గుట్టపు శ్రీనివాస్, నర్సింలు, రాజు పంతులు, నారాయణ, ఎల్లయ్య, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ సహిత శీతలమాత జాతర

**నర్సాపూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని అచ్చంపేట గ్రామంలో ఈనెల 9నుండి 13 వరకు శ్రీముత్యాలమ్మసహిత శీతలమాత(నల్లపోచమ్మ) జాతర మహోత్సవాలను నాలుగురోజులపాటు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ జాతర ఉత్సవాల్లో భాగంగా ఈనెల 9న శ్రీ ఆంజనేయస్వామికి అభిషేకం ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలు ఆలయ పూజారి హరిప్రసాద్‌శర్మ వేద మంత్రోచ్చరణల మధ్యన జరుగునుంది. ఈ మేరకు ఈ నెల 10న శీతలమాత నల్లపోచమ్మ అమ్మవార్లకు అభిషేకం 11న అమ్మవాళ్లకు బోనాల ఊరేగింపు, 12న బండ్ల ఊరేగింపు, 13న పాచిబండ్లు తిరుగుట, రంగం ఎక్కుట పోతరాజువిన్యాసాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అంతేగాక రాత్రి సమయాల్లో యక్షగానం కోలాట ప్రదర్శన. భజనలు అంటే సాంస్కృతి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

## 4లక్షల భరోసా చెక్కు అందజేత

**నర్సాపూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలంలోని ఎల్లారెడ్డి గూడ తాండకు చెందిన ఎస్బిఐ పాలసీ ఖాతాదారు మాలోత్ ప్రవీణ్ ఈనెల 5తేదీన రోడ్డుప్రమాదంలో మరణించగా అతనికి పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ ద్వారా క్లైమ్ అయిన 4లక్షల రూపాయిల చెక్కును నామిని పేరిట పాలసీదారుని తల్లి మాలోత్ బుజ్జికి బుధవారం స్థానిక ఎస్బిఐ బ్యాంకులో చీఫ్ మేనేజర్ హరినాథ్ చేతుల మీదుగా అందజేశారు.

## పెద్దశంకరంపేట మండలంలో 86.86 పోలింగ్



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

**పెద్దశంకరంపేట, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
పెద్ద శంకరంపేట మండలంలో మొదటి విడుత పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో మొత్తం పోలింగ్ శాతం 86.86 నమోదయిందని అధికారులు తెలిపారు. మండల పరిధిలోని ఆరేపల్లిలో 91.3, బద్దారంలో 93.3, బుజ్రంపల్లిలో 89.3, బూరుగుపల్లిలో 87.8, చీలపల్లిలో 85.1, దానంపల్లిలో 87.7, జి.వెంకటాపూర్లో 92.5, గొట్టిముక్కలలో 91.8, జమునానాయక్‌తండాలో 84.7, జూకల్‌లో కమలాపూర్‌లో 90.1, కోలపల్లిలో 90.2, కె.వెంకటాపూర్లో 87.3, లక్ష్మాపూర్‌లో 87, మల్కాపూర్‌లో 90.1, మూసాపేటలో 88.5, రామోజీపల్లిలో 88.5, శంకరంపేటలో 78.9, శివాయపల్లిలో 91.1, టెంకటి 89.3, ఉత్తులూరులో 90.3, వీరోజీపల్లిలో 90.9 పోలింగ్‌శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ సరళిని మెదక్ ఆర్‌డిఓ రమాదేవి పర్యవేక్షించారు. ఓటు వేయడానికి ఓటర్లు ఉదయంనుంచి బారులుతీరారు.

## గుమ్మడిదల మండలంలో పోటాపోటీ విజయాలు

**గుమ్మడిదల, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
గుమ్మడిదల మండలంలో గ్రామ పంచాయతీ ఫలితాలు: కాంగ్రెస్-బీఆర్‌ఎస్ మద్దతుతో అభ్యర్థుల ఔన్నత్యం గుమ్మడిదల మండలంలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఆసక్తికరంగా వెలువడ్డాయి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల మద్దతుతో పోటీచేసిన అభ్యర్థులు అద్భుత విజయాలు సాధించారు. ప్రజాభిమానం, అభివృద్ధిపట్ల విశ్వాసం కలిసి ఈఫలితాల్లో స్పష్టంగా కనిపించాయి. విజయాలు ఇలా ఉన్నాయి: 1.వీరారెడ్డిపల్లి సర్పంచ్‌గా బుద్ధుల దుర్గ (బీఆర్‌ఎస్) విజయం, 2.నాగిరెడ్డిగూడెం సర్పంచ్‌గా గడ్డం లావణ్య (బీఆర్‌ఎస్) విజయం, 3.మంబాపూర్ సర్పంచ్‌గా కొత్తకొండ భాస్కర్ (కాంగ్రెస్), 4.రామ్‌రెడ్డి బావి సర్పంచ్‌గా శ్యామల మహిపాల్‌రెడ్డి(కాంగ్రెస్) విజయం, 5.కొత్తపల్లి సర్పంచ్‌గా సూరారం మంజుల(బీఆర్‌ఎస్), 6. కానుకుంట సర్పంచ్‌గా ఇప్ప పెంటారెడ్డి(కాంగ్రెస్) గెలుపొంది ప్రజల నమ్మకాన్ని అందుకున్నారు. 7.అనంతరం గ్రామంలో కొమ్ము శ్రీనివాస్(బీఆర్‌ఎస్), 8.నల్లవల్లి స్వతంత్ర అభ్యర్థి కొరివి రాణి విజయం సాధించారు. ఈ ఫలితాలతో మండల రాజకీయాల్లో కొత్త ఉత్సాహం నెలకొనగా, గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలు మరింతవేగం పుంజుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## టిఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

**ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి**

**వెల్దుర్తి, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
మండలంలో తెలంగాణ రాష్ట్ర సమితి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సుడిగాలి పర్యటన నిర్వహించారు. మానేపల్లి, అందుగులపల్లి, ధర్మారం, కుకునూర్, ఎం.జలాల్పూర్, ఉప్పులింగాపూర్, వెల్దుర్తి గ్రామాలలో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మండల కేంద్రమైన వెల్దుర్తిలో అవి మాట్లాడుతూ టిఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థి శేఖర్, అలాగే చల్ల పద్మ మహేష్‌యాదవ్‌ను సర్పంచ్ అభ్యర్థిగా గెలిపించాలని ఆమె అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఆర్ గ్యారంటీలతో ప్రజలను ప్రభుత్వం మోసం చేసిందని ఆమె ఎండగట్టారు. ప్రజలు మూడో విడత ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులుగా టిఆర్‌ఎస్ బలపరిచిన వారికి ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. మండల కేంద్రంలో ప్రధాన రోడ్డు కుండా ప్రజలను కలుస్తూ ప్రచార నిర్వహించి కాంగ్రెస్ మహిళాలను ప్రజలకు వివరిస్తూ గతంలో ఉన్న పాలనను నేడు నడుస్తున్న పాలనను చేసుకోవాలని ప్రజలను కోరారు.

# గౌరవెల్లి ప్రాజెక్టుకు బొమ్మ వెంకన్న పేరు?

**-జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి కాంగ్రెస్ నాయకులు**



మాట్లాడుతున్న కేడం లింగమూర్తి

**హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
గౌరవెల్లి ప్రాజెక్టుకు మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్న పేరు పెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేస్తామని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తితోపాటు కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని నాగారం రోడ్డులోగల బొమ్మ వెంకటేశ్వర్లు విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టుకి బీజం పడింది బొమ్మ వెంకన్న కృషివల్లనే అని కొనియాడారు. ఆప్రాజెక్టుకి బొమ్మ వెంకన్న పేరు పెట్టాలని స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌస్ ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్‌చక్రవర్తి, జిల్లా లైబ్రరీ చైర్మన్ లింగమూర్తి సింగిల్విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, డిసిసి కార్యదర్శి చిత్తారి రవీందర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ చిత్తారి పద్మ, నాయకులు ఎండి. హసన్, వడ్డేపల్లి వెంకటరమణ, మైదామిశెట్టి వీరన్న, పున్న సది, వల్లపు రాజు, పచ్చిమట్ల రాధ, భూక్య సరోజన, లక్ష్మి, నాని, రజిత, కోమటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శివైక్యంపొందిన జీవన్ముక్త సంస్థానం పీఠాధిపతి

**చౌటకూరు, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని వెంకటకిష్టాపూర్ జీవన్ముక్త సంస్థానం పీఠాధిపతి ఉద్ధవభవ మహారాజ్ (87) గురువారం శివైక్యం పొందారు. గత 5 దశాబ్దాలుగా జీవన్ముక్త సంస్థానం పీఠాధిపతిగా కొనసాగుతూ వచ్చారు. నెల రోజుల క్రితం అనారోగ్యానికి గురైన మహారాజ్‌ను ఆసుపత్రిలో చేర్చి చికిత్సలు అందించారు. ఆసుపత్రిలో చికిత్స అందుకుంటూ గుండె పోటుకు గురై తిరిగిరాని లోకాలకు చేరిపోయారు. మహారాజ్ ఇకలేరన్న విషయం తెలుసున్న గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు శోకసముద్రంలో మునిగిపోయారు. మహారాజ్‌కు విజయ్ కుమార్, పవన్‌కుమార్‌లు కుమారులు ఉన్నారు.స్వగ్రామైన వెంకట కిష్టాపూర్‌లో మహారాజ్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు.

## సరాఫ్‌పల్లి సర్పంచ్‌గా రామచంద్రారెడ్డి



చంద్రారెడ్డికి నియామకపత్రం అందచేస్తున్న అధికారులు

**చౌటకూరు, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని సరాఫ్‌పల్లి పంచాయితీ సర్పంచ్‌గా నందికంటి రామచంద్రారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించి ధృవీకరణ పత్రం అందచేశారు. సర్పంచ్ పదవి ఏకగ్రీవం కాగా 3 వార్డులు సైతం ఏకగ్రీవం అయినాయి. పంచాయితీ పరిధిలోని మరో 5 వార్డులకు ఈ నెల 14న ఎన్నికలు జరుగనున్నాయి. కార్యక్రమంలో ఎంపిడిఓ కె శంకర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారరి సంగమేశ్వర్, ఎంపిపి మాజీ అధ్యక్షులు భూంరెడ్డి సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

## శివంపేట పాఠశాలను సందర్శించిన డిఈఓ



ప్రాథమిక పాఠశాలను సందర్శిస్తున్న డిఈఈఓ వెంకటేశ్వర్లు

**చౌటకూరు, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని శివంపేట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను బుధవారం జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సందర్శించారు. పాఠశాల వరండాల్లో కూర్చున్న విద్యార్థుల చెంతకు వెళ్లి నోటు పుస్తకాలను పరిశీలించి పాఠాలో చదివించారు. విద్యార్థులు రాయడం, చదవం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందచేస్తున్న మధ్యాహ్న భోజన వసతిని, మరుగుదొడ్లు, మూత్రశాలలను, విద్యుత్ తదితర మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. పాఠశాలకు ప్రహరీగోడ లేక ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు డిఈఓ దృష్టికి తీసుకుపోయారు. డిఈఓ వెంట ఏఎంఓ బాలయ్య, ఎంఈఓ అనురాధలు ఉన్నారు.

## బిఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతు పలకండి

**-కల్హేర్ మండలంలో మాజీ ఎమ్మెల్యే పంచాయతీ ప్రచారం**



ఎన్నికల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**కల్హేర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
పంచాయితీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ మద్దతుతో ఎన్నికల బరిలో ఉన్న సర్పంచ్, వార్డు సభ్యులకు ఓటర్లు మద్దతు పలికి ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. పంచాయితీ ఎన్నికలను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో బిఆర్‌ఎస్ మద్దతులో ఎన్నికల బరిలో అభ్యర్థుల విజయానికి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ బలపర్చిన ఇందిరా నగర్‌లో ఉప్పరరి సంగన్న, (కత్తెర గుర్తు), కల్హేర్‌లో కుమ్మరి సాయిలు (ఉంగరం గుర్తు), మాసాన్‌పల్లిలో సాయి గోండ (ఉంగరం గుర్తు), దేవునిపల్లిలో జగ్గారెడ్డి గారి గోపాల్‌రెడ్డి (ఉంగరం గుర్తు)లకు ఓట్లు వేసి సర్పంచ్‌లతో పాటు వారి ప్యానల్ అభ్యర్థులను గెలిపించుకుని గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఆయా గ్రామాల ప్రజలకు మాజీ ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు రామ్‌సింగ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు మండలంలో ప్రశాంతంగా ఓటింగ్

**-మూడు గ్రామపంచాయతీలకుగాను 84 శాతం ఓటింగ్**

**పటాన్‌చెరు, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని నందిగామ, భానూర్, క్యాసారం మూడు గ్రామపంచాయతీలకు సర్పంచ్ ఎన్నికల సందర్భంగా గురువారం ప్రశాంతవాతావరణంలో ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పలువురు వృద్ధులను వీల్ చైర్ల పైన తీసుకువెళ్లి ఓటును సద్వినియోగం చేసుకున్నారు. పటాన్ చెరు మండలంలోని మూడు గ్రామాలకు గాను 84 శాతం ఓటింగ్ నమోదయిందని జిల్లా సహాయ ఎన్నికల అధికారి, పటాన్‌చెరు ఎంపీడీవో యాదగిరి తెలిపారు. నందిగామ 87శాతం, భానూర్ 80శాతం, క్యాసారం 91 శాతం ఓటింగ్ నమోదయిందని తెలిపారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఓటింగ్‌సరళి కొనసాగింది. ఒంటిగంట తర్వాత పోలింగ్‌కేంద్రంలో ఉన్న ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పలు జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే మధ్యాహ్నం తర్వాత వార్డు సభ్యులు, సర్పంచ్‌ల ఓట్ల లెక్కింపు కొనసాగింది.

## నర్సాపూర్‌లో ఉచిత కంటివైద్య శిబిరం

**నర్సాపూర్, డిసెంబరు 11, ప్రభాతవార్త:**
నర్సాపూర్ పట్టణంలోని రైతువేదికలో నర్సాపూర్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మే డివిజన్ కంటి ఆసుపత్రి హైదరాబాద్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరం విజయవంతం అయింది. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండం మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ శిబిరంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులతో పాటు గుండం మోహన్‌రెడ్డి, ఉద్యోగుల సంఘం అమీన్పూర్ మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్నం రమేష్, విశ్రాంత ఉద్యోగులు తదితరులు వైద్యశిబిరంలో కంటిపరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి గంగారాం, కోశాధికారి యాకూబ్, అసోసియేట్ అధ్యక్షులు మహమ్మద్ జహీరుద్దీన్, ఉపాధ్యక్షులు విఠ్ఠల్, రుక్కమ్మ, జాయింట్ సెక్రెటరీ లింగారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సోనీ భాయ్, పబ్లిసిటీ సెక్రటరీ నర్సింలు, జిల్లా కౌన్సిలర్లు ఊర్మిళ నర్సింలు సత్యనారాయణ, సీనియర్ సభ్యులు మల్లారెడ్డి, క్రియాశీలక సభ్యులు ధన్సింగ్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.